# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 196 | విశాఖపట్నం | 17-4-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 196 | VISAKHAPATNAM | 17-4-2026 FRIDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | Pay


**Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram**




ఎంపీ-ఎమ్మెల్యే సీట్ల పెంపుపై అపోహలు-వాస్తవాలు..

## మా అభిప్రాయాన్ని ముందే చెప్పాం.. రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై సోనియా గాంధీ








వేసవిలో ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి?

# డీలిమిటేషన్‌తో నష్టం ఉండదు

- లోక్ సభలో ప్రధాని మోదీ
- మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌లో వివక్ష ఉండదని ప్రధాని హామీ
- ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా న్యాయం చేస్తామని ప్రకటన
- ఈ అంశంపై రాజకీయం చేయవద్దని విపక్షాలకు సూచన
- మహిళా రిజర్వేషన్ల క్రెడిట్ మీరే తీసుకోవచ్చని విపక్షాలకు ఆఫర్
- శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మహిళా రిజర్వేషన్ల అమలుకు ముందు చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) విషయంలో ఎలాంటి వివక్షకు, అన్యాయానికి తావుండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ విషయంలో తాను "గ్యారెంటీ", "ప్రామిస్" వంటి పదాలను ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నానని, ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా ఈ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. గురువారం లోక్‌సభలో 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026'పై జరిగిన చర్చలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని పిలుపునిచ్చారు. "ఈ బిల్లు ఘనతను మీరే తీసుకోండి. మీకు నచ్చిన వారి ఫొటోలతో నేను ప్రకటనలు ఇవ్వడానికైనా సిద్ధం. ఈ విషయంలో మీకు 'బ్లాంక్ చెక్' ఇస్తున్నా" అని విపక్షాలను ఉద్దేశించి అన్నారు. ఈ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చే శక్తిమంతమైనదని ప్రధాని అభిప్రాయపడ్డారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు (తరువాయి 2వ పేజీలో)

## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

# ఎనిమిది మంది మృతి

**కర్నూలు, పతాకం న్యూస్:** కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద జాతీయ రహదారిపై బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీ కొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతి చెందగా మరో 12 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు మృతి చెందగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు. దైవ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం: కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో బొలేరో లో 23 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు.





## నియోజకవర్గాల బిల్లుపై భగ్గుమన్న స్టాలిన్.. నడిరోడ్డుపై కాపీల దహనం

2లో

## జగన్‌పై కొల్లు ఫైర్



**మంగళగిరి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత జగన్ నిన్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యల పట్ల మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో స్పందించారు. జగన్ బతుకే ఒక అరాచకమని, ఆయనకు అభివృద్ధి చేయడం తెలియదని, గొడ్డలి రాజకీయమే తెలుసని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుండటాన్ని చూసి ఓర్వలేకే జగన్ కులాల మధ్య చిచ్చుపెట్టి అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. గురువారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని రవింద్ర మండిపడ్డారు. "ఐదేళ్ల పాటు నిధులు, బిల్లులు (తరువాయి 2వ పేజీలో)

## ఇంటింటి గణనలో తన వివరాలు నమోదు చేసుకున్న సీఎం చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో ఇంటింటి గణన, గృహాల జాబితా సేకరణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా చేపట్టిన స్వీయ నమోదు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రక్రియను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా తన వివరాలను నమోదు చేసి ఆరంభించారు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆయన ఈ ప్రక్రియను పూర్తి చేశారు. రాష్ట్ర జనాభా గణన సంచాలకులు జె. నివాస్ ఈ కార్యక్రమం గురించి ముఖ్యమంత్రికి వివరించారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియలో భాగంగా మొత్తం 33 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ౦వ.ఎవఅ-౦బం.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తన వివరాలను నమోదు చేశారు. ఈ స్వీయ నమోదు ప్రక్రియలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని అధికారులు కోరారు. ప్రజలు తమ ఇళ్లకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం కల్పించారు. దీనివల్ల జనగణన ప్రక్రియ మరింత సులభతరం, వేగవంతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## మహిళా రిజర్వేషన్లకు జనసేన కట్టుబడి ఉంది: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** పార్లమెంట్, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టసవరణ బిల్లులు పార్లమెంట్ ముందుకు రావడాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతించారు. మహిళా రిజర్వేషన్లకు జనసేన కట్టుబడి ఉందన్నారు. 2019 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టమైన హామీ ఇచ్చామని గుర్తు చేశారు. ఈ సవరణతో చట్టసభల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. సమర్థులైన మహిళలు దృఢమైన కుటుంబాలను తయారు చేస్తారని, దృఢమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయని పవన్ వ్యాఖ్యానించారు.




పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## భావ వ్యక్తీకరణ..

'కళ ద్వారానే ఒక జాతి యొక్క ఆత్మ సాక్షాత్కరిస్తుంది' అంటారు టాగూర్. ఏ దేశ సంస్కృతిలోనైనా కళకు ఒక ప్రత్యేక స్థానం వుంటుంది. ఇది సృజనాత్మకతను, సాంస్కృతిక వైవిధ్యాన్ని నిర్మిస్తుంది... ప్రోత్సహిస్తుంది. కళ అనేది మనిషి తన భావాలను, ఆలోచనలను, అనుభూతులను... రూపం, శబ్దం, రంగు, కదలికల ద్వారా అందంగా, సృజనాత్మకంగా వ్యక్తీకరించే ఒక ప్రక్రియ. అయితే, ప్రాచీన భారతీయ సాంప్రదాయంలో కళలను 64 రకాలుగా వర్గీకరించారు. వీటిలో చిత్రలేఖనం, శిల్పం, నాట్యం, నాటకం, సాహిత్యం, సంగీతం వంటివి ప్రధానంగా వున్నా, ఈ కళలకు మాత్రమే పరిమితం కాదు. మొత్తం మానవుని జీవన గమనానికి సంస్కృతి ప్రాతినిధ్యం వహిస్తుంది. భారతీయ సంస్కృతి వేల సంవత్సరాల చరిత్ర, అనుభవం, ఆచార వ్యవహారాల కలయిక. ఈ సంస్కృతిలో ఆట, పాట కేవలం వినోదం మాత్రమే కాదు, మన జీవన విధానంలో అంతర్భాగం. పల్లె గాలిలో మనోహరంగా వినిపించే జానపదాలు, పండుగల్లో ప్రతిబింబించే వివిధ రకాల నృత్య సంప్రదాయాలు, నాటకాలు, తోలుబొమ్మలాటలు భారతీయ ఆత్మకు ప్రతిబింబాలు. ఇవేగాక, కుటుంబ పరంగానూ, రక్త సంబంధీకులతో కలిగివుండే సంబంధ బాంధవ్యాల ద్వారా సంక్రమించే విలువలు, సాంప్రదాయాలు, ఆచారాల వంటివి కూడా సంస్కృతిలో భాగంగా వుంటాయి. అందుకే అంటారు గురజాడ-'దేశమంటే మట్టికాదోరు, దేశమంటే మనుషులోరు' అని. ఇవి ఒట్టి మాటలు కాదు... మన సంస్కృతికి మూలస్తంభాలు. ఆధునికత పేరుతో మన మూలాలను మర్చిపోతున్నాం. పాశ్చాత్య నాగరికత ప్రభావం, మతోన్మాదం మన సంస్కృతిని క్రమంగా కలుషితం చేస్తున్నాయి. డిజిటల్ యుగంలో ఫాస్ట్ బీట్ మ్యూజిక్, పాశ్చాత్య సంగీతం, సోషల్ మీడియా ట్రెండ్స్, ఫాస్ట్ ఫుడ్, పబ్ కల్చర్... మన మూలాలను మసకబారుస్తున్నాయి. ఒకప్పుడు గ్రామీణ్యంలో కోలాటాలు, తప్పెటగుళ్లు, గొల్లసుద్దులు, పద్య నాటకాలు వంటి ఆట పాటలతో కళలు జనరంజకంగా వుండేవి. ఇప్పుడు టీవీ, మొబైల్ గేమ్స్, రీల్స్, ఓటిటి ప్లాట్‌ఫారమ్‌లు ఆ స్థానాన్ని ఆక్రమించాయి. ఇక మతోన్మాదం కూడా కొత్త రూపం తీసుకుంది. ఇవే కళలను, మాధ్యమాలను తనకనుకూలంగా మార్చుకుంటూ..అసలైన భారతీయతకు వక్రభాష్యాలు చెబుతూ భ్రష్టపరుస్తోంది. 'మన సంస్కృతి--ఆట పాటలు, కళలలో దాగివుంది. దాన్ని కోల్పోతే, మనల్ని మనమే కోల్పోతాం' అంటారు స్వామి వివేకానంద. కళను, కళాకారులను గౌరవించడంతో పాటు మానవ జీవితాల్లో కళ ప్రాముఖ్యతను తెలియజేసే ఉద్దేశంతో ప్రతి యేటా ఏప్రిల్ 15న 'ప్రపంచ కళా దినోత్సవం' నిర్వహిస్తారు. 'కళ అనేది మాటల్లో చెప్పలేని భావాన్ని వ్యక్తీకరించే ఒక మాధ్యమం' అంటాడు లియొనార్డో డా విన్సీ. ఈయన పుట్టినరోజు సందర్భంగా నిర్వహిస్తోన్న ఈ వేడుక-- 'భావవ్యక్తీకరణల వనం: కళ ద్వారా సమాజాన్ని పెంపొందించడం' అనే నినాదంతో ఈ ఏడాదిని ఫలవంతం చేయనుంది. ఒక తోటలో రకరకాల మొక్కలు, విభిన్న వర్ణాల పూలు కలిసి వుంటేనే అందం. సమాజం కూడా అచ్చం అటువంటిదే. భాషలు, ప్రాంతాలు, కుల మతాలకు అతీతంగా మనుషులను ఏకం చేయగలిగే శక్తి ఒక్క కళకే వుంది. ఒక చిత్రం వేల పదాల భావాన్ని వ్యక్తపరిస్తే, ఒక కళ సమాజంలోని రుగ్మతలను ప్రశ్నిస్తుంది, సమాజాన్ని చైతన్యపరుస్తుంది. కళాకారులు సమాజానికి దిక్సూచీలు. వారు పండించే భావాల తోటలో శాంతి, సహనం, సౌభ్రాతృత్వం వికసించాలి. 'ప్రతి బిడ్డలోనూ ఒక కళాకారుడు వుంటాడు. సమస్యల్లా పెద్దయ్యాక కూడా ఆ కళాకారుడ్ని మనలో ఎలా సజీవంగా వుంచుకోవాలనేదే' అంటాడు పాబ్లో పికాసో. ఏ దేశ సంస్కృతి అయినా నిలబడాలంటే, యువత దానిని గౌరవించాలి. 'మన సంస్కృతిని కాపాడుకోవడం అంటే...దాన్ని జీవవంతంగా వుంచడం, అంతేగాని మ్యూజియంలో పెట్టడం కాదు' అంటారు అంబేద్కర్. మన సంస్కృతిని యువత గౌరవించి, ఆచరించినప్పుడే ఆ సంస్కృతి సజీవంగా వుంటుంది. అలాగని, మూఢత్వాన్ని గుడ్డిగా అనుకరించడం కాదు. మన సంస్కృతిలోని మంచిని స్వీకరించి, కాలానుగుణంగా అభివృద్ధి చేయాలి. జానపద కళలను, స్థానిక కళాకారులను ప్రోత్సహించాలి. భారతదేశం భిన్న ఆలోచనల సంగమం. ఈ సంగమంలో ప్రతి తరానికి బాధ్యత వుంది. మన సంస్కృతిని పరిపుష్టం చేసి, భవిష్యత్ తరాలకు అందించడమే కళా దినోత్సవం అసలైన ఉద్దేశం.

## ఓటు హక్కుని వినియోగించుకోలేదని ఓటర్లను శిక్షించలేం : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తమ ఓటు హక్కుని వినియోగించుకోలేదని ఓటర్లను శిక్షించలేమని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఎన్నికల రోజున పోలింగ్ బూత్ కు వెళ్లకూడదని నిర్ణయించుకున్నందుకు ఓటర్లను శిక్షించడం గాని అరెస్ట్ చేయడం గాని కుదరదని పేర్కొంది. ఓటర్లు తమహక్కుని స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఓటు వేయాలా వద్దా అనే నిర్ణయం పూర్తిగా ఓటరుదేనని స్పష్టం చేసింది. ఉదాహరణకు రోజువారీ కూలి లేదా ఇతర రాష్ట్రం నుండి వచ్చిన వలసదారులను తీసుకుంటే.. చర్యలు తీసుకుంటామని బెదిరించి, వారి రోజువారీ స్వల్ప ఆదాయాన్ని వదులుకుని మరీ ఓటు వేసేందుకు సొంత రాష్ట్రం వెళ్లాలని వారిపై ఒత్తిడి తీసుకురాలేమని సిజెఐ పేర్కొన్నారు. ఓటు వేయలేదని ఆ పమయంలో వారిని అరెస్టు చేయమని ఆదేశించాలా అని ప్రశ్నించారు. చట్టబద్ధమైన పాలన, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే దేశంలో, అందరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని ఆశిస్తారని, ఒక వేళ కుదరకపోతే వెళ్లరు అని అన్నారు. ఇందు కోసం ఓటు హక్కుపై అవగాహన కల్పించడం ఒక్కటే విరుగుడు అని, వారిపై ఒత్తిడి తీసుకురాలేమని అన్నారు. సంబంధిత అధికారులను లేదా భాగస్వామ్యులను సంప్రదించమని పిటిషనర్ ను ఆదేశించారు. ఓటు హక్కుని వినియోగించుకోని ఓటర్లను శిక్షించాలని, లేదా ఆంక్షలు విధించాలని కోరుతూ అజయ్ గోయల్ పిటిషన్ ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

## మా అభిప్రాయాన్ని ముందే చెప్పాం.. రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై సోనియా గాంధీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మహిళల రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గ పునర్విభజన బిల్లులపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తాజాగా స్పందించారు. మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు స్పందిస్తూ తమ పార్టీ వైఖరిని ముందే తెలియజేశామని అన్నారు. ఈ విషయంలో అదనంగా తాను చెప్పాల్సిందేమీ లేదని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బిల్లులను నేడు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్, హోం మంత్రి అమిత్‌షా లోక్‌సభ ముందుకు తీసుకొచ్చారు. 131వ రాజ్యాంగసవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను మంత్రి మేఘ్‌వాల్ ప్రవేశపెట్టగా, కేంద్రపాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాలకు సంబంధించిన బిల్లును అమిత్ షా సభ ముందు పెట్టారు. బిల్లులను అనుమతించాలా? వద్దా? అన్న అంశంపై ఓటింగ్ జరగ్గా మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు వేశారు. ఈ బిల్లులపై 12 గంటల పాటు చర్చ జరగనుంది. అవసరమైతే సమయాన్ని స్పీకర్ పొడిగిస్తారని కేంద్రం పేర్కొంది. రేపు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరిగే అవకాశం ఉంది.

## రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం కోసం లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తున్నారు: గొట్టిపాటి రవి



**అమరావతి, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న నారా లోకేశ్‌పై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో లోకేశ్ ఒక సైనికుడిలా ముందడుగు వేసి కేడర్‌లో భరోసా నింపారని ఆయన కొనియాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా, యువగళం పాదయాత్రలో అనేక ఆంక్షలు ఎదురైనా రాష్ట్ర ప్రజల కోసం లోకేశ్ వెనకడుగు వేయకుండా పోరాడారని మంత్రి గుర్తుచేశారు. ఒంగోలులో నిర్వహించిన మహానాడు విజయవంతం కావడం వెనుక లోకేశ్ సమర్థవంతమైన సమన్వయం ఉందని పేర్కొన్నారు. టీడీపీని కోటి మంది సభ్యత్వం కలిగిన శక్తివంతమైన ప్రాంతీయ పార్టీగా తీర్చిదిద్దిన ఘనత లోకేశ్‌దేనని ఆయన చెప్పారు. ముఖ్యంగా కార్యకర్తల కోసం 'కార్యకర్తల సంక్షేమ నిధి'ని ఏర్పాటు చేయడం, వారికి ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించడం వంటి విప్లవాత్మక నిర్ణయాలను ఆయన ప్రస్తావించారు. ఒకవైపు పార్టీ బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు మంత్రిగా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తున్నారని మంత్రి ప్రశంసించారు. విద్యా విధానంలోనూ ఆయన అనేక సంస్కరణలు తీసుకువచ్చి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కష్టపడే కార్యకర్తలకు గుర్తింపునిస్తూ, ఆధునిక ఆలోచనలతో పార్టీని నడిపిస్తున్న లోకేశ్ నాయకత్వం రాష్ట్రానికి, పార్టీకి కొండంత అండ అని గొట్టిపాటి రవికుమార్ అభిప్రాయపడ్డారు.

## లోక్‌సభ స్థానాల పునర్విభజన వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు: కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలో మహిళా రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ స్థానాల పునర్విభజనపై నెలకొన్న ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ వల్ల ఏ రాష్ట్రం కూడా తన ప్రాతినిధ్యాన్ని కోల్పోదని, అన్ని రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ గురువారం లోక్‌సభలో భరోసా ఇచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ అధినియం) అమలుకు సంబంధించి లోక్‌సభలో జరిగిన చర్చలో మంత్రి కీలక వివరాలను వెల్లడించారు. ప్రతిపాదిత మార్పుల ప్రకారం, లోక్‌సభలోని ప్రస్తుత సభ్యుల సంఖ్యను 543 నుంచి 815 కి పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. పెరిగిన స్థానాల్లో 33 శాతం చొప్పున మొత్తం 272 స్థానాలను మహిళలకు కేటాయించనున్నారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా అన్ని రాష్ట్రాల్లోని స్థానాలను దాదాపు 50 శాతం మేర పెంచేలా ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి తెలిపారు. దీనివల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందనే భయాలకు తావులేదని ఆయన స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లను 2029 సాధారణ ఎన్నికల నుంచే అమలు చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమని మేఘ్‌వాల్ పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం మూడు ముఖ్యమైన బిల్లులను సభ ముందు ఉంచింది: 1. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 2. డీలిమిటేషన్ (పునర్విభజన) బిల్లు, 2026 3. కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026. 'మహిళల పురోగతి ఆధారంగా ఒక సమాజం పురోగతిని నేను కొలుస్తాను' అని చెప్పిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాటలను ఈ సందర్భంగా మంత్రి ఉటంకించారు. మరోవైపు, ప్రభుత్వ ప్రతిపాదనలపై ప్రతిపక్షాలు భిన్న స్వరాలు వినిపించాయి. పునర్విభజన ప్రక్రియ వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ లబ్ధి చేకూరి, దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కే ప్రమాదం ఉందని విపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కుల గణన ఆధారంగానే రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ సహా ఇతర ఇండియా కూటమి పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం (ఏప్రిల్ 17) సాయంత్రం 4 గంటలకు ఈ బిల్లులపై ఓటింగ్ జరగనుంది. ఈ బిల్లులు ఆమోదం పొందితే, భారత పార్లమెంటరీ చరిత్రలో ఇది ఒక అతిపెద్ద నిర్మాణాత్మక మార్పుగా నిలిచిపోనుంది.

(మొదటిపేజీ తరువాయి)

## నష్టం ఉండదు

విధాన నిర్ణయాల్లో పాలుపంచుకోవడం ద్వారా 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. 2023లోనే 'నారీ శక్తి వందన్ అధినియం'ను ఏకాభిప్రాయంతో ఆమోదించామని గుర్తుచేశారు. "2029 నాటికి మహిళా కోటాను అమలు చేయడంలో విఫలమైతే, మన చిత్తశుద్ధిని మహిళలు నమ్మరు. దశాబ్దాలుగా వారికి నిరాకరించిన హక్కులను అందించే గొప్ప అవకాశం ఇప్పుడు మనకు లభించింది" అని మోదీ అన్నారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోడీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. 'పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయనివ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే. వారు తమ హక్కుల కోసం 30 ఏళుగా పోరాడుతున్నారు. తమ శక్తి నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ బిల్లు వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఈ విషయంలో రాజకీయం చేయొద్దు. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ రేపు(శుక్రవారం) ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. అంతకుముందు, ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని లోక్‌సభ ఆమోదించింది. విపక్షాలు రికార్డెడ్ ఓటింగ్ కోసం పట్టుబట్టడంతో, డివిజన్ ప్రక్రియ ద్వారా దీనికి ఆమోదం లభించింది.

## జగన్‌పై కొల్లు ఫైర్

ఇవ్వకుండా హార్బర్ నిర్మాణాన్ని అడ్డుకుని, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసింది జగన్. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు వేగవంతం చేసి, 901 మీటర్ల జెట్టీ, కోల్డ్ స్టోరేజ్‌లతో ఆధునిక హార్బర్‌గా పూర్తి చేస్తుంటే.. మత్స్యకారులను రెచ్చగొట్టేలా అసత్యాలు మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. జువ్వలదిన్నెలో దేశ రక్షణకు కీలకమైన 'సాగర్ డిఫెన్స్' సంస్థకు కేంద్ర అనుమతితో భూమి కేటాయిస్తే, దానిని తరిమికొడతాననడం జగన్ దుర్మార్గపు ఆలోచనకు నిదర్శనమని కొల్లు రవింద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "తల్లి, చెల్లిని వెళ్లగొట్టారు, సొంత బాబాయినే వేసేశారు. ఇప్పుడు దేశ రక్షణ సంస్థను కూడా తరిమికొడతానంటున్నారు. అంటే జగన్‌కు దేశం మీద కూడా భక్తి లేదు. ఆయనకు తెలిసింది గొడ్డలి పార్టీ, గొడ్డలి గుర్తు.. నరుక్కుంటూ పోవడమే" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. గత ఐదేళ్లలో 800 పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన చరిత్ర జగన్‌దని రవింద్ర ఆరోపించారు. "కియా, అమరరాజా వంటి సంస్థలను బెదిరించి పొరుగు రాష్ట్రాలకు పంపారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు.

# ఉపాధి పథకాన్ని వినియోగించుకోండి: ఎంపీ శ్రీభరత్



**వేపాడ, పతాకం న్యూస్:** ఉపాధి పథకాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీ శ్రీభరత్ అన్నారు. కొలుకుపాలెం గ్రామంలో తాగునీటి పథకాన్ని ఎమ్మెల్యే లలితకుమారితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించాల్సి ఉండగా ఈ ప్రాంత ప్రజలు 40 రోజులు మాత్రమే వినియోగించు కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ప్రజలు అడుగు తున్నారని.. ఈ విషయమై పార్లమెంటులో ప్రస్తావిస్తానన్నారు. ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ రూ.220 కోట్లు జలజీవన్ మిషన్ నిధులతో తాగునీటి పథకాల పనులు చేపడుతున్నటు చెప్పారు. దబ్బిరాజుపేటలో తాగునీటి సమస్య ఉన్నట్టు తన దృష్టికి వచ్చిందని.. దీని పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శానాపతి లీల, అప్పారావు, మండల టీడీపీ అధ్యక్షుడు గొంప వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, సహకార సంఘ సభ్యుడు గుంటపల్లి దేముడుబాబు, గోగాడ జగన్నాథం నాయుడు, కూటమి నాయకులు అప్పారావు, సత్తిబాబు, లట్టాల పవన్ పాల్గొన్నారు.

## జిల్లాలో 4,98,467 మంది ఓటర్లు



**పాడేరు, పతాకం న్యూస్:** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జిల్లాలోని పంచాయతీల్లో అధికారులు ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4 లక్షల 98 వేల 467 మంది ఓటర్లున్నారని అధికారులు ప్రకటించారు. జిల్లాలోని పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల పరిధిలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి, పెదబయలు, ముంచంగిపుట్టు.. మొత్తం 11 మండలాల్లో 244 గ్రామ పంచాయతీలు, 2,446 వార్డులు, 3,460 పోలింగ్ కేంద్రాలున్నాయి. అలాగే పురుషులు 2 లక్షల 41 వేల 447 మంది, మహిళలు 2 లక్షల 56 వేల 997 మంది, ఇతరులు 23 మంది.. మొత్తం 4 లక్షల 98 వేల 467 మంది ఓటర్లున్నారని జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్.కుమార్ తెలిపారు. అలాగే జిల్లాలో చింతపల్లి మండలంలో అత్యధికంగా 65 వేల 374 మంది ఓటర్లుండగా, అనంతగిరిలో అత్యల్పంగా 38 వేల 286 మంది ఓటర్లున్నారు. అరకులోయలో 42,725 మంది, డుంబ్రిగుడలో 38,743, జి.మాడుగులలో 44,674, జీకేవీధిలో 52,412, హుకుంపేటలో 45,787, కొయ్యూరులో 43,711, ముంచంగిపుట్టులో 38,895, పాడేరులో 44,536, పెదబయలు మండలంలో 43,324 మంది ఓటర్లున్నారు. బుధవారం ప్రతి పంచాయతీ కేంద్రంలో ఓటరు జాబితాల ప్రదర్శన ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ అధికారులకు సూచించడంతో ఆ ప్రక్రియను నిర్వహించారు. అయితేప్రస్తుతం సర్పంచుల కాల పరిమితి ముగియడం ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీలుండడంతో ఎన్నికలపై అందరి దృష్టిపడింది.

## వడివడిగా గూగుల్ అడుగులు

### ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి 28న శంకుస్థాపన



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రపంచమంతా నివ్వెరపోయేలా విశాఖపట్నంలో రూ.1.35 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ నెల 28న ఆనందపురం మండలం తర్లువాడలో శంకుస్థాపనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సెంటర్‌కు అవసరమైన విద్యుత్ కోసం కూడా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఒక గిగావాట్ (వెయ్యి మెగావాట్లు) సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఏర్పాటుచేస్తామని గూగుల్ ప్రకటించింది. ఇందుకోసం మూడు ప్రాంతాల్లో (తర్లువాడ, ముడసర్లోవ/అడవివరం, అనకాపల్లి జిల్లా రాంబిల్లి) భూములు తీసుకుంది. మూడుచోట్ల కలిపి వేయి మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు నిర్మిస్తుంది. వాటికి అవసరమైన విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సి ఉంది. విశాఖపట్నం జిల్లా అంతటికీ ఒక రోజుకు అవసరమైన విద్యుత్ లోడ్ డిమాండ్ వేయి మెగావాట్లు. అంతే విద్యుత్ ఇప్పుడు గూగుల్‌కు అవసరం. దీనిని ఈపీడీసీఎల్ కాకుండా నేరుగా ట్రాన్స్‌కో సమకూరుస్తుంది. తొలిదశలో తర్లువాడకు 260 మెగావాట్లు, ముడసర్లోవ/అడవివరానికి 160 మెగావాట్లు, రాంబిల్లికి మరో 160 మెగావాట్లు మొత్తం 580 మెగావాట్ల విద్యుత్ కావాలని గూగుల్ తరఫున ఏర్పాటైన రైడెన్ ఇన్ఫోటెక్ కంపెనీ ఈపీడీసీఎల్‌కు దరఖాస్తు చేసింది. వాటిని ఇక్కడి అధికారులు ట్రాన్స్‌కోకు పంపించారు. 300 మెగావాట్లు సామర్థ్యం దాటి కంపెనీలు పెట్టే సంస్థలు వాటి విద్యుత్‌లో 51 శాతం పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకువస్తోంది. అది గూగుల్‌కు కూడా వర్తిస్తుంది. అంటే గూగుల్ తనకు అవసరమైన వెయ్యి మెగావాట్లలో 510 మెగావాట్లు సోలార్/విండ్/పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ సమకూర్చుకోవలసి ఉంటుంది. తర్లువాడ, ముడసర్లోవల్లో గూగుల్‌కు కేటాయించిన భూముల్లో ఎల్‌టీ, 11 కేవీ విద్యుత్ లైన్లు ఉన్నాయి. వాటిని అక్కడి నుంచి తొలగించి భూములు అప్పగించాల్సి ఉంది. ఈ ప్రాంతాల్లో వ్యవసాయానికి ఉపయోగించే విద్యుత్ పంపు సెట్లు కూడా ఉన్నాయి. కొన్ని సింహాచలం దేవస్థానానికి చెందినవి కాగా, మరికొన్ని ఉద్యానవన శాఖకు చెందినవి ఉన్నాయి. ఆ లైన్ల తొలగింపునకు వారి అనుమతులు అవసరం. ప్రస్తుతానికి రైతుల భూముల్లో లైన్లను పక్కకు జరుపుతున్నారు. ఆయా సంస్థల అనుమతులు వచ్చాక ఆ పనులు కూడా చేపట్టడానికి ఈపీడీసీఎల్ అధికారులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.తర్లువాడలో తాత్కాలిక విద్యుత్ కనెక్షన్

## పెరుగుతున్న విద్యుత్ వినియోగం..



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఎండలు ఠారెత్తిస్తున్నాయి. బయట తిరగలేని విధంగా వాతావరణం మారిపోయింది. ఇంట్లో ఉన్నా, ఆఫీసులో ఉన్నా ఒకటే ఉక్కపోత. అందుబాటులో ఉంటే ఏసీ లేదంటే కూలర్. ఇవేమీ లేకపోతే ఫ్యాన్ అయినా తప్పనిసరిగా వాడాల్సి వస్తోంది. దీంతో విద్యుత్ వినియోగం క్రమంగా అధికమవుతోంది. విద్యుత్ లోడ్ డిమాండ్ కూడా పెరుగుతోంది. విశాఖపట్నం సర్కిల్‌లో పది లక్షల మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరంతా కలిసి రోజుకు సగటున 18 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తారు. అదే మే నెల ఎండలైతే ఈ డిమాండ్ 20 మిలియన్ యూనిట్ల నుంచి 22 మిలియన్ యూనిట్ల వరకు పెరుగుతుంది. ఇది ఏప్రిల్ నెలే. అయినా ఎండలు మండిపోతున్నాయి. దాంతో విద్యుత్ వినియోగమూ ఆ స్థాయిలో కనిపిస్తోంది. ఈ నెల 11వ తేదీన అంటే శనివారం 20 మిలియన్ యూనిట్లు దాటేసింది. ఈ నెలలో ఇప్పటివరరకూ అదే అత్యధిక వినియోగం కావడం గమనార్హం. అదేవిధంగా ఈ 9, 10 తేదీల్లో కూడా ఇంచుమించుగా విద్యుత్ వినియోగం అలాగే నమోదైంది. 9న 19.384 మి.యూ., 10న 19.991 మి.యూ. వాడేశారు. మళ్లీ 12వ తేదీన అంటే ఆదివారం కూడా 19.11 మి.యూ. కాల్చేశారు. ఈ క్రమంలో విద్యుత్ డిమాండ్ 847 మెగావాట్ల నుంచి ఏకంగా 990 మెగావాట్లకు చేరింది. ఇంకో రెండు రోజులు ఆగితే వేయి మెగావాట్లకు చేరుతుంది. ఈపీడీసీఎల్ అధికారులు పరిపాలనా సౌలభ్యం కోసం విశాఖపట్నం (జిల్లా) సర్కిల్‌ను మూడు జోన్లుగా విభజించారు. జోన్-1లో మహారాణిపేట, జగదాంబ, ఆశీల్‌మెట్ట, సీతమ్మధార, మద్దిలపాలెం తదితర ఏరియాలు, జోన్-2లో కంచరపాలెం, మర్రిపాలెం, ఎన్ఎస్‌టీఎల్, ఆటోనగర్, కూర్మన్నపాలెం, వడ్లపూడి, పెదగంట్యాడ, జోన్-3లో మధురవాడ, కొమ్మాది, పీఎంపాలెం, సాగర్‌నగర్, ఆరిలోవ, పెందుర్తి, వేపగుంట, ఆనందపురం, భీమిలి ప్రాంతాలు ఉన్నాయి. ఇప్పుడు జోన్-2లోనే రోజుకు 11 మిలియన్ యూనిట్లకు పైగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. జోన్-1లో సగటున రోజుకు 3 మి.యూనిట్లు, జోన్-3లో రోజుకు సగటున 5 మిలియన్ యూనిట్లు వాడుతున్నారు.

## చందనోత్సవానికి అంకితభావంతో పనిచేయాలి: కలెక్టర్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక చందనోత్సవ వేడుకను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో వివిధ శాఖల అధికారులతో తుది విడత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఉత్సవ ప్రాంతాన్ని మొత్తం 12 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు దేవస్థానం, రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి ముగ్గురు సీనియర్ అధికారులను ఇన్‌ఛార్జిలుగా నియమించినట్లు తెలిపారు. వీరు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, తక్షణ నిర్ణయాలు తీసుకుంటూ పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్ల నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. కొండ దిగువన ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాల వద్ద ప్రత్యేక అధికారులను నియమించి భక్తుల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే హోల్డింగ్ ఏరియాలను వినియోగించాలని సూచించారు. ఆర్‌టిసి బస్సుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించాలని ఆదేశించారు. జివిఎంసి ఆధ్వర్యంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక సౌకర్యాలను పకడ్బందీగా కల్పించాలని ఆదేశించారు. డ్యూటీలో ఉన్న అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో అందుబాటులో ఉండాలన్నారు. చందనోత్సవం రోజున సుమారు 2 లక్షల మంది భక్తులు విచ్చేసే అవకాశమున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, దేవస్థానం అధికారులు బృంద స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. ఒక పాస్‌పై ఒక వాహనాన్నే అనుమతించేలా నిబంధనలు అమలు చేస్తామని, దీనికి అందరూ సహకరించాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. దర్శనానికి ఒక్క వీఐపితో పాటు గరిష్టంగా ఆరుగురు సభ్యులకు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రయివేటు వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డిసిపిలు మేరీ ప్రశాంతి, మణికంఠ, డిఆర్‌ఒ ఎం.విశ్వేశ్వర నాయుడు, దేవస్థానం ఇఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒలు సంగీత్ మాథుర్, శేషశైలజ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణపై అయోమయం!



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణపై అనిశ్చితి నెలకొంది. మరికొద్ది రోజుల్లో శిబిరాలు మొదలుకానుండగా ఆయా క్రీడలకు సంబంధించిన పరికరాలు ఇంతవరకు జిల్లాకు చేరలేదు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏటా వేసవిలో పాఠశాల స్థాయి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ, వివిధ క్రీడల్లో రాణిస్తున్న ఎనిమిది నుంచి 14 ఏళ్ల లోపు బాలబాలికలను గుర్తించి వారిని మరింతగా ప్రోత్సహించడం ఈ శిబిరాల ఉద్దేశం. ఈ శిబిరాలు మొదలుకాకముందే ఆయా క్రీడలకు సంబంధించిన పరికరాలను ప్రభుత్వం సరఫరా జిల్లాలకు చేస్తుంది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు వాటిని ఆయా మండలాలకు పంపుతుంటారు. కానీ గత ఏడాది శిబిరాలు ప్రారంభం అయ్యేనాటికి పరికరాలు రాలేదు. దీంతో క్రీడా శిబిరాలకు హాజరైన విద్యార్థులు సొంత సొమ్ముతో పరికరాలు కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. అయితే క్రీడా శిక్షణ శిబిరాలు ముగిసిన తరువాత పరికరాలు పంపిణీ కావడం ఈ సందర్భంగా గమనార్హం. కాగా ఈ ఏడాది మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు సిద్ధమవుతున్నారు. మొత్తం 50 చోట్ల వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఆసక్తిగల బాలబాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గత ఏడాది మాదిరిగా కాకుండా ఈసారి క్రీడా పరికరాలను ముందుగా అందజేయాలని జిల్లా అధికారులు ఇప్పటికే శాప్‌కు ఇండెంట్ పెట్టారు. క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ఇంకా రెండు వారాలు మాత్రమే గడువు వుండగా, ఇంతవరకు క్రీడా పరికరాలు రాలేదు. వాస్తవానికి వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు క్రీడా సామగ్రి, శిక్షకుడి గౌరవ వేతనం, మైదానం నిర్వహణ ఖర్చులకు అవసరమైన నిధులను శాప్ ముందుగానే విడుదల చేయాలి. గతంలో ఒక్కో శిబిరానికి రూ.10 వేలు అందజేశారు. కానీ ఈసారి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు జిల్లా ప్రాధికార సంస్థకు ఇంకా నిధులు విడుదల కాలేదని తెలిసింది. దీంతో ఇసారి కూడా సొంత సొమ్ముతో పరికరాలు కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందేమోనని క్రీడాకారులు అంటున్నారు.

## మే 17 నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు




**పాడేరు, పతాకం న్యూస్:** మే నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించాల్సిన స్థానిక మోదకొండమ్మ ఉత్సవాల తేదీలను మార్పు చేశారు. మే 17, 18, 19 తేదీల్లో ఉత్సవాలను నిర్వహించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమక్షంలో కలెక్టర్ టి.నిశాంతి ప్రకటించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ టి.నిశాంతి, ఎస్పీ అమిత్‌బర్దార్, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ఉత్సవాల సమన్వయ సమావేశంలో కాసేపు చర్చించిన అనంతరం ఉత్సవాల తేదీలను మార్చాలని అధికారులు నిర్ణయించారు. ప్రధానంగా ప్రస్తుతం దేశంలో పలు రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు చెందిన పోలీసు బలగాలు ఆయా రాష్ట్రాలకు తరలివెళ్లాయని, ఈ క్రమంలో మే 10, 11, 12 తేదీల్లో ఉత్సవాలకు బందోబస్తు నిర్వహించలేమని ఎస్పీ అమిత్‌బర్దార్ తెలిపారు. దీంతో మోదకొండమ్మ ఆలయం ప్రధానార్చకుడు సుబ్రహ్మణ్యంను రప్పించి ఉత్సవాల నిర్వహణకు అనువైన తేదీలను తెలపాలని సూచించారు. దీంతో మే 17, 18, 19 తేదీల్లో ఉత్సవాల నిర్వహణకు అనువుగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ తేదీలపై అందరి అభిప్రాయం తెలియజేసి ఆమోదం తెలపాలని మంత్రి సంధ్యారాణి కోరారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు అభ్యంతరం తెలిపారు. తాము నిర్ణయించిన తేదీలను మార్చేసి వేరే తేదీలను సూచించడం సరికాదన్నారు. దీనిపై స్పందించిన మంత్రి సంధ్యారాణి తేదీలను మీకు నచ్చినట్లు ప్రకటిస్తే ఎలా? అని, మోదకొండమ్మ ఉత్సవాలు ప్రభుత్వ పండుగ అని, అందరి సమన్వయంతో తేదీలను ప్రకటించాలన్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లు, భద్రత కల్పించే అధికారుల అభిప్రాయాలకు అనుగుణంగా అందరికి ఆమోదయోగ్యమైన తేదీల్లో ఉత్సవాలను నిర్వహించాలని మంత్రి పేర్కొని, తేదీలను ప్రకటించాలని కలెక్టర్‌కు సూచించారు. దీంతో మే నెల 17, 18 19 తేదీల్లో మోదకొండమ్మ ఉత్సవాలు జరుగుతాయని, అధికారులు, ఆలయ, ఉత్సవ కమిటీ సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తామని కలెక్టర్ నిశాంతి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, డీఆర్‌వో నీలకంఠరావు, ఆర్‌డీవో లోకేశ్వరరావు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, వివిధ శాఖల అధికారులు, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అనధికార చెరువు నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

**పరవాడ, పతాకం న్యూస్:** విశాఖ ఫార్మా సిటీ వద్ద ఏలేరు కాలవను ఆనుకొని అనధికార చెరువు నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ (రాంకీ) యాజమాన్యం చేస్తున్న బరితెగింపు చర్యలను తీవ్రంగా ఖండించారు. అక్రమంగా నిర్మాణం చేస్తున్న చెరువును గనిశెట్టి సత్యనారాయణతో కలిసి కోటేశ్వరరావు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అనధికారికంగా గ్రీన్ బెల్ట్‌ను తొలగించి, ఫార్మా వ్యర్థ జలాల పాండ్లు నిర్మిస్తున్నా ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లేదని తెలిపారు. ఇది అత్యంత ప్రమాదకరంగా నిర్మిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు పరిశీలించి ఆ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నిర్మిస్తున్న పాండ్‌కు సుమారు 100 మీటర్ల దూరంలో ఉన్న ఏలేరు కాలువ ద్వారా ప్రవహిస్తున్న గోదావరి నీరు కాలుష్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. దీనివల్ల విశాఖ నగర, స్టీల్‌ప్లాంట్ ప్రజలు తీవ్రమైన జబ్బులకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. తాడి గ్రామానికి సమీపంలో రహదారి పక్కనే గ్రీన్ బెల్టు ఏరియాలో అక్రమంగా నిర్మిస్తున్నా ఎందుకు ఆపడం లేదో అధికారుల సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న చెరువును వెంటనే నిలిపివేయాలని, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోటేశ్వరరావు, గనిశెట్టి డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో
# కాపర్‌వైర్లు చోరీ



**పలాస, పతాకం న్యూస్:** : స్థానిక ఉదయపురం శివారులో ము న్సిపాలిటీ తాగునీటి పథకం వద్ద ఏ ర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోని కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. వీటి విలువ రూ.3 లక్షల వరకూ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. ఐదో నెంబరు బావికి సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేయించారు. ఇందులోని కాపర్ వైర్ చోరీ జరగడంతో తాగునీటికి విఘాతం కలిగింది. ప్రస్తుతం ఉద్దానం రక్షిత నీటి పథ కం ద్వారా నీరు సరఫరా కావడంతో బావిలో నీటిని తాత్కాలికంగా నిలిపివేశారు. ఉద్దానం నీరు పూర్తిగా నిలిచిపోతే బావినీరు వినియోగించేందుకు దీన్ని సిద్ధం చేశారు. ఈ క్రమంలో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకి దించి అందులో ఉన్న రాగి వైర్లను దొంగిలించారు. ఆ ప్రాంత రైతులు ఈ చోరీ విషయాన్ని మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. ఏఈ కిరణ్ కుమార్, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఏఈ తెలిపారు.

## మస్తర్లలో తేడాలు కనిపిస్తే చర్యలు



**టెక్కలి, పతాకం న్యూస్:** గ్రామాల్లో ప్రతి కుటుంబా నికి ఉపాధి కల్పించడమే లక్ష్యమని, అయితే మస్తర్లలో తేడాలు కనిపిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ బి.లవరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పార్పీ ఎస్.మాధవ్ పనుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా లవరాజు మాట్లాడుతూ.. ముగ్గురు డీఆర్పీలు 10 మంది విలేజ్ సోషల్ ఆడిటర్లు గ్రామసభలు నిర్వహించి పనులను తనిఖీ చేసి ఆడిట్ నిర్వహించారన్నారు. ప్రతీ వేతనదారుడికి కనీస వేతనం రూ.300 దాటేలా పనులు కల్పించాలని, పని జరిగినపుడు తప్పనిసరిగా టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండాలన్నారు. ప్రతీ వేతనదారుడికి ముఖ ఆధారిత యాప్‌లో మస్తర్ వేయాలని సూచించారు. మస్తర్‌లో గాని, పనుల్లో గాని అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీలు సీహెచ్ శ్రీనివాసరావు, పి.రాధ, హెచ్ఆర్ శ్రావణ్, ఎంపీడీవో ప్రభాకరరావు, ఎంపీపీ బోర పుష్ప, పీఏసీఎస్ చైర్మన్ పెదిని బాబ్జీ, ఏపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కేసుల దర్యాప్తును సవాలుగా తీసుకోండి: ఎస్పీ దామోదర్



**మెళియాపుట్టి, పతాకం న్యూస్:** నేరస్వభావం మారుతుండడంతో కొత్తతరహా కేసులు నమోదవుతున్నాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఈ తరుణంలో కేసుల దర్యాప్తును సవాలుగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న వివిధ కేసులు, చార్జిషీట్ల సమీక్ష చేశారు. అనంతరం ఎస్పీ మట్లాడుతూ కేసుల మిస్టరీలను ఛేదించేందుకు సాంకేతికత ను అందిపుచ్చుకోవాలన్నారు. సోషల్ మీడియా దుర్వినియోగం.. వ్యక్తిత్వ హననానికి పాల్పడటం వంటివి తీవ్రంగా పరిగణించాలన్నారు. గంజాయి నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సాక్ష్య యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు గోవిందరావు, ఎస్. రాఘవులు, వీరకుమార్, న్యాయసలహాదారులు వై.పరశురాం, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

**గూడెంకొత్తవీధి, పతాకం న్యూస్:** మండలంలోని నిమ్మలపాలెం గ్రామంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. మృతులిద్దరూ బావ, బావమరిదిలు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గూడెంకొత్తవీధి మండలం పెదవలస గ్రామ పంచాయతీ బడ్డుమామిడివీధికి చెందిన దేశగిరి కృష్ణకుమార్, మొండిగెడ్డ గ్రామానికి చెందిన చినకల అబ్రహాంలు బావ, బావమరిది. వీరిద్దరూ చింతపల్లి ముత్యాలమ్మ జాతరకు వెళ్లారు. రాత్రి 12 గంటలకు పెదవలసకు తిరుగు ప్రయాణమయ్యారు. నిమ్మలపాలెం వంతెన వద్దకు వచ్చేసరికి నేరెళ్లబంధ గ్రామం నుంచి చింతపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తున్న వెంకటరావు ఎదురుగా వస్తున్న కృష్ణకుమార్, అబ్రహాంల వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో కృష్ణకుమార్, అబ్రహాంలు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. వెంకటరావు స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంపై జీకేవీధి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నియోజకవర్గాల బిల్లుపై భగ్గుమన్న స్టాలిన్.. నడిరోడ్డుపై కాపీల దహనం



**చెన్నై, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. నమక్కల్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన బిల్లు కాపీని స్వయంగా దహనం చేసి తన వ్యతిరేకతను బలంగా చాటారు. ఈ బిల్లును 'నల్ల చట్టం'గా అభివర్ణించిన ఆయన, దీనికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నిరసనలో భాగంగా, తమిళనాడులోని ఇళ్లు, బహిరంగ ప్రదేశాల్లో నల్ల జెండాలు ఎగురవేయాలని స్టాలిన్ కోరారు. చెన్నై గోపాలపురంలోని దివంగత మాజీ సీఎం కరుణానిధి నివాసంపై మొదటి నల్ల జెండాను ఎగురవేసి ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. కేవలం జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పెంచడం వల్ల జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం, రాజకీయ పలుకుబడి తగ్గిపోతుందని ఆయన అన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనలో జనాభాతో పాటు రాష్ట్రాల ఆర్థిక సహకారం (జీఎస్‌డీపీ) వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 1950, 60 దశకాల్లో తమిళ గడ్డపై జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమం తరహాలోనే ఈ బిల్లుకు వ్యతిరేకంగా మరో పోరాటం మొదలైందని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

ప్రస్తుతం ఉన్న 545 లోక్‌సభ స్థానాలను 850కి పెంచాలని కేంద్రం ప్రతిపాదించింది. అయితే ఈ పెంపు ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయంగా అధిక లబ్ధి చేకూరుస్తుందని, దక్షిణాది రాష్ట్రాల వాణిని అణచివేస్తుందని డీఎంకే సహా పలు విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

## కోనేరు అభివృద్ధి పనులను పరిశీలించిన అచ్చెన్నాయుడు



**టెక్కలి, పతాకం న్యూస్:** పట్టణ అభివృద్ధిలో భాగంగా పట్టుమహాదేవి కోనేరు సుందరీ కరణ పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. టెక్కలి పర్యటనలో భాగంగా కో నేరు వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి కోనేరు అభివృద్ధి ప్రణాళికపై వివరణ ఇచ్చారు. అంతకుముందు కోనేరు స మీపంలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంత్రి సందర్శించి స్వామివారికి పూజలు చేశారు. త్వరలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఫ్యా మిలి కార్డు అందిస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధిద్వారా టెక్కలి నియోజకవర్గం పరి ధిలో 26 మంది లబ్ధిదారులకు రూ.23లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 22 నెలల్లో ఒక్క టెక్కలి నియోజకవర్గంలోనే 304 మంది లబ్ధి దారులకు రూ. 3.2 కోట్లు చెక్కులను అంద జేసినట్టు తెలిపారు.

## సోలార్ విద్యుత్ వినియోగం పెరగాలి



**మెళియాపుట్టి, పతాకం న్యూస్:** ప్రతి ఇంటిలో సోలార్ విద్యుత్ వినియోగం పెరగాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మెళియాపు ట్టిలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి సూర్యఘర్ సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ వాడకాన్ని పెంచడానికి అధికంగా నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ వెలుగులు ఇవ్వటం ఆనందంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అధికంగా విద్యుత్ చార్జీలను పెంచి సామాన్యులకు ఇబ్బందులు పెట్టిందన్నా రు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆర్థిక కష్టాలు ఉన్నా విద్యుత్ చార్జీలు తగ్గించిందన్నారు. నియోజకవర్గానికి ఉచితంగా 3,500 యూనిట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఎస్.మోహనరావు, విద్యుత్‌శాఖ ఈఈ నరసింహకుమార్, డీఈ ప్రసాదరావు, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, టీడీపీ నాయకులు ఎన్.వెంకట్రావ్, అనపాన రాజశేఖరెడ్డి, దినకర్ తదితరులు పాల్గొన్నారు. పాతపట్నంలో బుధవారం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### రోడ్డు ప్రమాద బాధితులకు వరం
# 'పీఎం రాహత్': సత్యకుమార్




**విజయవాడ, పతాకం న్యూస్:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రమాద బాధితులకు తక్షణ వైద్యసహాయం అందించడంపై ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ప్రమాద బాధితులకు లక్షన్నర రూపాయల వరకు తక్షణ నగదు రహిత వైద్యసేవలు అందించేందుకు 'పీఎం రాహత్' పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద మొదటి కేసు చిత్తూరు జిల్లాలో నమోదైందని, బాధితుడిని వెంటనే తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించామని చెప్పారు.పీఎం రాహత్ కార్యక్రమంపై విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. దేశంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 45 శాతం మరణాలు ఆంధ్రప్రదేశ్‌లోనే సంభవించడం ఆందోళనకర విషయమని చెప్పారు.

## పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు



**పాడేరు, పతాకం న్యూస్:** పేదల ఆకలి తీర్చాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తున్నదని రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. కలెక్టర్ టి.నిశాంతి, జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మలతో కలిసి పాడేరులో అన్న క్యాంటీన్‌ను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అన్న క్యాంటీన్ సేవలు అందుబాటులోకి రావడం ఆనందమన్నారు. పేదలకు ప్రయోజనం కలుగుతుందనే ఆలోచనతోనే రూ.61 లక్షల వ్యయంతో దీనిని ఏర్పాటు చేశామన్నారు. కేవలం రూ.5కే రుచి, నాణ్యత కలిగిన ఆహారాన్ని అందిస్తారని, దీనిని ఈ ప్రాంతీయులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ నిశాంతి, జేసీ శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ, జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తదితరులు పలువురికి భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టీడీపీ నేతలు చల్లంగి లక్ష్మణరావు, బొర్రా విజయరాణి, బాకూరు వెంకటరమణ, గంగపూజారి శివకుమార్, డప్పోడి వెంకటరమణ, బుద్ద జ్యోతికిరణ్, బుక్కా జగదీశ్, అల్లంగి సుబ్బలక్ష్మి, డిప్పల వెంకటకుమారి పాల్గొన్నారు.

## మూడు క్లస్టర్లలో రూ.20 లక్షల వరకు నిధులు గోల్‌మాల్




**విజయనగరం, పతాకం న్యూస్:** బాడంగి మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధిం చి మూడు క్లస్టర్లలో రూ.20 లక్షల వరకు నిధులు గోల్‌మాల్ అయినట్టు డీఆర్‌పీలు దుర్గాప్రసాద్, కృష్ణప్రసాద్, రాములు వెల్లడించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో వారు మాట్లాడా రు. అధికంగా మస్తర్ల దిద్దుబాట్లు, సంతకాలు ఫోర్జరీలు, కొలతల తేడాలు ఉండడంతో పాటు వాడాడలో రూ.30 వేల మొక్కలు నాటినట్టు రికార్డులలో చూపినప్పటికీ క్షేత్రస్థాయిలో మొక్కలు లేవన్నారు. ఆకులకట్ట, ఆనవరం, గూడెపువలస, వాడాడ, కోటిపల్లి, రేజేరు, పినపెంకి, పి.వెంకంపేట పరిధిలో రూ.6 లక్షలపైనే రికవరీ చేయాల్సి ఉందన్నారు. భీమవరం, ముగడ, పాల్తేరు, బాడంగి, లక్ష్మీపురం, పిన్నవలస గ్రామాల్లో వారానికి ఒకసారి మాత్రమే సంతకాలు తీసుకోవడం, కొలతల తేడాలు చూపించి సుమారు రూ.6.50 లక్షల వరకు అధికంగా బిల్లులు నమోదు చేసినట్టు గుర్తించామన్నారు. బాడంగి, కోడూరులో 50 శాతం పనులు కూడా జరగలేదన్నారు. దీంతో ఏపీడీ రమాదేవి బాడంగి ఫీల్డ్ అసిస్టెంట్ సుధారాణిపై ఆగ్రహం వ్యక్తం చేశా రు. అలాగే బొత్సవానివలస, డొంకినవలస, గజరాయనివలస, గొల్లాది, మల్లం పేట, పెదపల్లి, పింద్రంగివలస, పూడివలస, తెంటువలస, వీరసాగరం గ్రా మాల్లో కూడా కొలతల తేడాలు, మస్తర్లలో ఫోర్జరీలు, దిద్దుబాట్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. రూ.7 లక్షలపైగా రికవరీ చేయాల్సి ఉందన్నారు. మొత్తం రూ.20 లక్షలు రికవరీకి ఆదేశించారు. ప్రజావేదికలో ఏపీడీ చంద్రకుమారి, ఎస్ఆర్‌పీ ఎం.తిరుపతిరావు, ఏపీవో సాయిరాం పాల్గొన్నారు.

## భూవివాదం.. గొంతు కోసి దారుణ హత్య

**తిరుపతి, పతాకం న్యూస్:** చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి గ్రామీణ మండలం అడపారెడ్డి పల్లిలో దారణం జరిగింది. భూ వివాదం కారణంగా అమర్‌నాథ్ రెడ్డి అనే వ్యక్తిని గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు బొమ్మి రాహుల్‌రెడ్డిగా పోలీసులు గుర్తించారు. అడపారెడ్డి పల్లికి చెందిన నిందితుడు రాహుల్ రెడ్డిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే అతడు తన కుటుంబ సభ్యులతో కలిసి పరారైనట్లు పోలీసులు గుర్తించారు. అతడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ హత్యతో అమర్‌నాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు కోపంతో రగిలిపోయారు. బొమ్మ రాహుల్ రెడ్డి ఇంటితోపాటు అతడి బైక్‌కు మృతుడి బంధువులు నిప్పు పెట్టారు. దాంతో అడపారెడ్డి పల్లిలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎం.ఆర్.పల్లి పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## తిరుమల దర్శనాల పేరుతో మోసాలు.. భక్తులకు టీటీడీ కీలక హెచ్చరిక




**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుమల శ్రీవారి దర్శనాలు, గదులు ఇప్పిస్తామంటూ సోషల్ మీడియా వేదికగా కొందరు వ్యక్తులు సాగిస్తున్న మోసాలపై టీటీడీ ఉక్కుపాదం మోపింది. భక్తులను మాయమాటలతో నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్న ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ క్రమంలోనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు టీటీడీ ఒక ప్రకటనలో వెల్లడించింది. సోషల్ మీడియాలో "శ్రావణ్ కళ తిరుమల, తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం" అనే ఐడీతో భక్తులను మోసగిస్తున్న ఇద్దరు వ్యక్తులను టీటీడీ విజిలెన్స్ విభాగం, పోలీసుల సమన్వయంతో అదుపులోకి తీసుకుంది. నిందితులను చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన కామసాని పవన్ కుమార్ అలియాస్ నాగరాజు, బోడిరెడ్డి చెన్నకేశవులుగా గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల కాలంలో ఇలాంటి మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. శ్రీవారి దర్శన టికెట్లు, గదుల బుకింగ్ కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌ను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించింది. ఎవరైనా దర్శనాలు, గదులు ఇప్పిస్తామని సంప్రదిస్తే, వెంటనే టీటీడీ విజిలెన్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నంబర్ 9866898630కు సమాచారం ఇవ్వాలని కోరింది.

## ఇంటర్ విద్యార్థిని కీర్తన హత్యపై సమగ్ర విచారణ చేపట్టాలి




**కడప, పతాకం న్యూస్:** ఖాజీపేటలోని అగ్రహారంలో ఇంటర్ విద్యార్థిని రామ కీర్తనను దారుణంగా హత్య చేసిన ఉన్మాది ఆవుల వెంకటేష్‌ను కఠినంగా శిక్షించాలని, ఆ నిందితుడితోపాటు మరో వ్యక్తి కూడా ఉన్నారంటూ జరుగుతున్న ప్రచారంపైలోతుగాగా విచారణ చేపట్టాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సావిత్రమ్మ డిమాండ్ చేశారు. అగ్రహారంలోని బాధిత కుటుంబాన్ని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులుతో కలిసి పరామర్శించి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కీర్తన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి.సావిత్రమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్ మాట్లాడుతూ నిందితుడు ఆవుల వెంకటేష్ కీర్తనను వెంకటేష్ అత్యంత కీరాతకంగ, విచక్షణ రహితంగకత్తితో గొంతుకోసి చంపాడని తెలిపారు. అతను అత్యంత కిరాతకుడని, చెడు అలవాట్లకు బానిస అయ్యాడన్నారు. కీర్తన చనిపోయే క్షణంలో వెంకటేష్ తోపాటు మరొక వ్యక్తి ప్రవీణ్ పేరు చెప్పిందని అతనిని ఇంతవరకు అరెస్టు చేయకపోవటం ఏంటని ప్రశ్నించారు. హత్యకు సహకరించిన వారిని కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల కుటుంబంకు అండగా నిలబడి నిరసన తెలియజేసిన గ్రామస్తులపై అక్రమ కేసులు బనాయించడం సరైన చర్య కాదని వెంటనే వారిపై పెట్టిన కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కీర్తన కేసు దర్యాప్తు త్వరగా చేపట్టి బాధితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థిక ప్రయోజనాలు త్వరగా కుటుంబానికి అందజేయాలన్నారు. బాధిత కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు లక్ష్మీదేవి, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్.సుబ్బమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ముంతాజ్ బేగం, సరస్వతి, జమీల, మోక్షమ్మ, ప్రేమ, విజయ కుమారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు సిఐటియు మాజీ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులురెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, జెవివి సమత మహిళ విభాగం జిల్లా నాయకులు సరస్వతి, కామేశ్వరమ్మ, రాజామణి, ఎపి మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.విజయలక్ష్మి, రవణమ్మ, మేరీ, ఎఐఎస్ఎఫ్ నాయకులు చంద్ర, ఖాజీపేట సిపిఎం నాయకులు వెంకటసుబ్బయ్య, రాజశేఖర్‌రెడ్డి బ్రహ్మంగారిమఠం సిపిఎం మండల కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

## అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగించాలి



**కర్నూలు, పతాకం న్యూస్:** వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా పంట పొలాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్లను తొలగించేందుకు విద్యుత్, అటవీశాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్ సూచించారు. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటి ఎకో టూరిజంలో విద్యుత్, అటవీశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 డిసెంబరు 5న జరిగిన సమావేశంలోని పలు అంశాలపై చర్చించినట్లు చెప్పారు. ప్రత్యేకించి అటవీ సమీప, వ్యవసాయ క్షేత్రాల్లో వేటగాళ్లు అక్రమ విద్యుత్ కనెక్షన్లను ఏర్పాటు చేసి వన్యప్రాణులకు ముప్పు కలిస్తున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయన్నారు. వీటి నియంత్రణ కోసం గత మూడేళ్ల వ్యవధిలోని ఫీడర్లు, వారి ట్రిప్పింగ్ డేటాను ఈ నెల 25వ తేదీలోగా తమకు సమర్పించాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. అలాగే వన్యప్రాణులకు ప్రమాదం పొంచి ఉండే ప్రాంతాల్లో అమర్చిన అక్రమ విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని తెలిపారు.

# ఎంపీ-ఎమ్మెల్యే సీట్ల పెంపుపై అపోహలు-వాస్తవాలు..



**అమరావతి, పతాకం న్యూస్:** చట్టసభల సభ్యుల సంఖ్య పెంచడం వల్ల ప్రజలకు నయాపైసా ఉపయోగం లేకపోగా, పైగా పెరిగిన సభ్యుల సంఖ్య వలన ప్రజలపై అదనపు భారం పడుతుంది అనేది నా అభిప్రాయం. మన పాలనలో, ఎన్నికల వ్యవస్థలో మౌలికమార్పులు రానంతవరకు మనదేశం అభివృద్ధి చెందిన దేశం కాజాలదు. అయితే, ఇప్పుడు సీట్ల సంఖ్య పెంపుపై అనవసర రాద్ధాంతం జరుగుతున్నందున, ఉత్తరాది దక్షిణాది అనే రెచ్చగొట్టే పోస్టులు ఎక్కువవుతున్నందున, ఈ పోస్ట్ పెడుతున్నాను. లోక్ సభ స్థానాలను 850 కి పెంచడం, మహిళకు 33% సీట్లు రిజర్వ్ చేయడం కోసం కేంద్రప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకొస్తోంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోషల్ మీడియా లో చాలామంది పోస్టులు పెట్టారు. వాళ్ళు చెబుతున్న అభ్యంతరాలు ఏంటి అంటే.. ఈ సీట్ల పెంపు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాల సీట్లతో సంబంధం లేకుండా కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పాటు చేయవచ్చు అనేది ప్రధాన ఆరోపణ.

ఇప్పుడు దేశంలో 543 లోక్ సభ స్థానాలు ఉంటే, దక్షిణాది కి 130 ఉన్నాయి. ఉత్తరాది కి 413 స్థానాలు ఉన్నాయి. కేంద్రంలో అధికారం దక్కాలంటే 272 మంది సభ్యులు కావాలి. ఇప్పుడు కూడా దక్షిణాది తో సంబంధం లేకుండానే కేంద్రంలో అధికారంలోకి రావచ్చు, బిల్స్ పాస్ చేసుకోవచ్చు. రాష్ట్రాల వారీగా లోక్ సభ స్థానాలను 50% పెంచడం వల్ల దక్షిణాది కి నష్టం జరుగుతుంది అనేది అపోహ మాత్రమే.

ఇక రాజ్యాంగ సవరణ చేయాలంటే, పార్లమెంట్ లో 2/3 మెజారిటీ కావాల్సి ఉంటుంది. ఇప్పుడున్న సీట్ల ప్రకారం, 543 లో 2/3 అంటే, 362 లోక్ సభ స్థానాలు కావాలి. దక్షిణాది తో సంబంధం లేకుండానే లోక్ సభలో 2/3 మెజారిటీ తెచ్చుకోవచ్చు. 2/3 రాష్ట్రాల అనుమతి కూడా తెచ్చుకోవచ్చు. ఇదే నిష్పత్తిలో లోక్ సభ సీట్లు పెరిగితే దక్షిణాది కొత్తగా వచ్చే నష్టం ఎక్కడుంది? ఇక, మొత్తం లోక్ సభ సీట్లలో ఇప్పుడు దక్షిణాదికి 24% సీట్లు ఉంటే, కొత్త సీట్ల ప్రకారం 23% అవుతుంది. ఈ ఒక్క శాతం తగ్గడం వల్ల వచ్చే నష్టం ఏమీ లేదు ఎందుకంటే, లోక్ సభ స్థానాల సంఖ్య అనేది, అధికారం లోకి రావడానికి, బిల్స్ పాస్ చేయడానికి కీలకం.. ఈ రెండు సందర్భాలలోనూ , నేను పైన చెప్పినట్లు యధాతథ స్థితే ఉంటుంది.

ఇక మహిళా రిజర్వేషన్ కోసం, సీట్ల పెంపు ఎందుకు అంటే, ఇప్పుడున్న సీట్లలోనే 33% సీట్లు మహిళలకు ఇవ్వాలంటే, సిటింగ్ ఎంపీలు తమ సీట్లు వదులుకోవాల్సి వస్తుంది. దానికి వీళ్ళు ఎందుకు ఒప్పుకుంటారు. అందుకే, 33% సీట్లు పెంచి, మొత్తం మీద 33% సీట్లను మహిళలకు కేటాయిస్తున్నారు.

2011 జనాభా లెక్కలను ఎందుకు పరిగణన లోకి తీసుకోవాలి అంటే, 2021 లో జనాభా లెక్కల సేకరణ మొదలు పెడితే బాగుండేది. కరోనా కారణంగా అది ఆలస్యం అయింది. 2024 లో అయినా జనాభా లెక్కల సేకరణ మొదలు పెట్టె అవకాశం ఉన్నా, అది చేయలేదు. ఇది కేంద్రం చేసిన తప్పు. అయితే అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50% సీట్లు పెంచుతున్నందువల్ల, 2011 లెక్కలు అయినా, 2021 లెక్కలు అయినా రాష్ట్రాలకు నష్టం జరగదు. ఇక దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువ సంపద సృష్టిస్తున్నందువల్ల, జనాభాని నియంత్రించడం వల్ల, ఎక్కువ సీట్లు కేటాయించాలి అనేది చాలా చాలా ప్రమాదకరమైన వాదన.. ఎవరైతే ఎక్కువ సంపాదిస్తారో, వారే ఎక్కువ ఖర్చు పెట్టగలరు. కాబట్టి ఎక్కువ పన్నులు కట్టి ప్రభుత్వం నుండి తక్కువ ప్రయోజనం పొందేవారికి, తక్కువ పన్నులు కట్టి ప్రభుత్వం నుండి ఎక్కువ ప్రయోజనం పొందేవారికి, ఒకే రకమైన ఓటు విలువ ఎందుకు ఉండాలి? ఎవరు ఎక్కువ పన్నులు కడుతున్నారో వారి ఓటుకి ఎక్కువ విలువ ఉండాలి అనే వాదన మొదలవుతుంది. ఈ వాటాలు, విలువల లెక్క తేల్చడం ఎవరి వల్లా కాదు. ఈ వాదన ఇంకా ముదిరితే, కొన్ని మతాల వారు జనాభా నియంత్రణ పాటించలేదు, మా మతం వారు జనాభా నియంత్రణ పాటించారు. కాబట్టి, మా మతానికి అన్యాయం జరుగుతోంది, 1947లో మతాల వారీ జనాభా నిష్పత్తి ప్రకారం, మతాల వారీగా ఓటు కి వెయిటేజ్ ఇవ్వాలనే వాదన కూడా వస్తుంది. వీటన్నిటి దృష్ట్యా..ఇప్పుడు రాష్ట్రాల వారీగా 50% సీట్లు పెంచడం అనేది అత్యుత్తమ పరిష్కారం.

# విశాఖ సమ్మిట్‌లో కార్మికుల సంక్షేమంపై చర్చించండి

**అరకు జిల్లా, పతాకం న్యూస్:** ఈ ఏడాది జిల్లాలో ఇంటర్మీడియట్ ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణత 86 శాతంగా నమోదై రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 5,653 మంది విద్యార్థులకు గాను 4,368 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 77 శాతంగా, ద్వితీయ సంవత్సరంలో 5,370 మంది విద్యార్థులకు గాను 4,603 మంది ఉత్తీర్ణులై 86 శాతం నమోదైంది. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఇంటర్ రెండు సంవత్సరాల ఫలితాలు ఆశాజనకంగా ఉండడంతో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలో ఇంటర్ విద్య చాలా వరకు మెరుగుపడిందనే చెప్పాలి. గతంలో శాశ్వత ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు లేకపోవడంతో పాటు సరైన పర్యవేక్షణ ఉండేది కాదు. దీంతో గత ఏడాది, అంతకు ముందు సైతం ఆశించిన స్థాయిలో ఇంటర్ ఫలితాలు సాధించలేకపోయారు. కానీ ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గిరిజన సంక్షేమ గురుకులాలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో సైతం చక్కని ఫలితాలు సాధించారు. ప్రధానంగా వంద రోజుల ప్రణాళిక, డైలీ టెస్ట్‌ల కారణంగా విద్యార్థుల్లో బోధన, అభ్యాసన మరింత మెరుగుపడడం వల్లే చక్కని ఫలితాలు సాధించామని సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు అభిప్రాయపడ్డారు. జిల్లాలో ఇంటర్ ఫలితాల్లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల, గిరిజన సంక్షేమశాఖ గురుకులాల విద్యార్థులు సత్తా చాటారు. తొలి ఏడాది ఫలితాల్లో జిల్లాలోని అనంతగిరి, జి.మాడుగుల, హుకుంపేట, ముంచంగిపుట్టు కేజీబీవీల్లో శాత శాతం ఉత్తీర్ణత సాధించగా, మిగిలిన కేజీబీవీల్లో 77 శాతం నుంచి 95 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అలాగే ద్వితీయ సంవత్సరంలో అనంతగిరి, డుంబ్రిగుడ, జి.మాడుగుల, హుకుంపేట, ముంచంగిపుట్టు, పాడేరు కేజీబీవీలు శత శాతం ఉత్తీర్ణత సాధించగా, మిలిగిన వాటిల్లో సైతం 97, 98




శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. గిరిజన సంక్షేమ శాఖ గురుకులాల్లోనూ చక్కని ఫలితాలు వచ్చాయి. తొలి ఏడాదిలో జి.మాడుగుల, పాడేరు గురుకులాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించగా, మిగిలిన గురుకులాల్లో 85 నుంచి 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో అరకులోయ, జీవీకేధి గురుకులాల్లో శత శాతం, మిగిలిన గురుకులాల్లో 96 నుంచి 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కంటే గిరిజన సంక్షేమ శాఖ గురుకులాలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో చక్కని ఫలితాలు సాధించడంపై అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## 17న జరిగే జాబ్ మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలి: హరీష్ చంద్ర

**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో ఏప్రిల్ 17న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె. హరీష్ చంద్ర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ఫిన్వేస్కో కాపిటల్ ఇండియా ప్రైవేట్ లిమిట్, ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ , ఇండస్ ఇండ్ బ్యాంక్ , కంపెనీలోని రాజమండ్రి పరిసర



ప్రాంతంలో గల పలురకాల పోస్టల భర్తీకొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడనున్నాయని ఆయన తెలిపారు. ఎస్ఎస్ సి , ఇంటర్, ఐ టీ ఐ,నుండి ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన, ఎమ్ బిఏ పూర్తి చేసి అనుభవం ఉన్న లేదా ఆశక్తి గల 19 నుండి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా employment.ap.gov.inలింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, బయో డేటా / రెజ్యూమ్ , ఆధార్ మరియు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్ తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు శుభవార్త.. రెండు కొత్త రైళ్లు ప్రకటించిన రైల్వే శాఖ

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ప్రయాణించే రైల్వే ప్రయాణికులకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ శుభవార్త అందించింది. ప్రయాణికుల రద్దీ, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు కొత్త వారపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే నడుస్తున్న కొన్ని ప్రత్యేక రైళ్లను క్రమబద్ధీకరించడంతో పాటు మరికొన్ని రైళ్ల సేవలను పొడిగించింది. దక్షిణ మధ్య రైల్వే విడుదల చేసిన వివరాల ప్రకారం చర్లపల్లి-నర్సాపురం-చర్లపల్లి (17061/17062) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కొత్తగా ప్రకటించారు. ఇది ఇప్పటివరకు నడుస్తున్న ప్రత్యేక రైలు స్థానంలో రెగ్యులర్ సర్వీసుగా నడుస్తుంది. మే 2 నుంచి ప్రతి శనివారం రాత్రి 7:50 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు నర్సాపురంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:50 గంటలకు చర్లపల్లికి వస్తుంది. ఈ రైలు నల్గొండ, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. అలాగే, నర్సాపురం-తిరుపతి-నర్సాపురం (17428/17427) మధ్య మరో వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా ప్రవేశపెట్టారు. ఏప్రిల్ 27 నుంచి ప్రతి సోమవారం సాయంత్రం 3:50 గంటలకు నర్సాపురంలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3:40 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మే 3 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 10:10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9:30 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది.

## న్యాయవాదిపై పోలీసుల దాడి అమానుషం



**అనంతపురం, పతాకం న్యూస్:** అనంతపురం బార్ అసోసియేషన్ న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డి పై కనగానపల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ , సబ్ ఇన్స్పెక్టర్ , వారి కొంతమంది సిబ్బంది జరిగిన దాడి అమానుషమని ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గురువారం కోర్టు విధులకు బహిష్కరించి కోర్టు ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రషీదుల్లా మాట్లాడుతూ .... న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై వెంటనే కేసు నమోదు చేసి వారిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను ప్రభుత్వం తీసుకువచ్చి ఇంప్లిమెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వస్తేనే న్యాయవాదులకు రక్షణ ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కే మల్లికార్జున, న్యాయవాదులు గురు రాజారావు, రామకృష్ణ, ఈర్షద్ అహ్మద్, నారాయణ, సురేష్, నబి రసూల్, రఘు రాము, రంగనాథ్, బి తిమ్మప్ప, న్యాయవాదులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఏర్పాటు ప్రక్రియపై బీజేపీ దాడి: నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్–భారత్ విభజనతో పోల్చడం దుర్మార్గమని విమర్శించారు. భారత రాజ్యాంగానికి లోబడి, పార్లమెంట్ ఆమోదంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితమని స్పష్టం చేశారు. దశాబ్దాల పోరాటం ఫలితంగా తెలంగాణ సాక్షాత్కరించిందని మాజీ మంత్రి చెప్పుకొచ్చారు. మిడిమిడి జ్ఞానం, అవగాహన లోపంతో బీజేపీ ఎంపీలు తెలంగాణ ఏర్పాటు మీద అవాకులు చెవాకులు పేలుతున్నారని మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా తెలంగాణ ఏర్పాటు ప్రక్రియపై బీజేపీ దాడి చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు.. తేజస్వీ సూర్య వ్యాఖ్యలను ఖండించాలన్నారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం



**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** గర్భిణులకు, బాలింతలకు మంచి పోషకాలు ఉండే ఆహారం అవసరమని డాక్టర్ మల్లిక, డాక్టర్ భారతి అన్నారు. మండలంలోని భట్లమగుటూరు(ఆలమూరు) గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లిక, డాక్టర్ భారతి గర్భిణులకు, బాలింతలకు పోషకాహారపు అలవాట్లు గురించి అవగాహన కల్పించారు. అలాగే రెండు సంవత్సరాల లోపు పిల్లలకు బ్రెయిన్ డెవలప్మెంట్ 80 శాతం ఉంటుంది కాబట్టి పిల్లలను మొబైల్, టివి స్క్రీన్‌లు చూడకుండా, వారి దృష్టి కుటుంబ అనుబంధాలు, ఆటల వైపు మళ్లించి పిల్లల భవిష్యత్తు కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సూపర్‌వైజర్ రామారావు, శివప్రసాద్, అంగన్వాడీ సూపర్‌వైజర్ రూత్ కుమారి, అంగన్వాడీ టీచర్స్ కవిత, శ్రీలక్ష్మీ, డ్వాక్రా సిఎ చంద్రకళ, ఆశాలు మనిశ్రీ, అరిగెల విజయలక్ష్మి, గ్రామ జనసేన అధ్యక్షులు బయ్యే బాలాజీ, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫెయిల్.. చెరువులో దూకి విద్యార్థి ఆత్మహత్య

**కడప, పతాకం న్యూస్:** ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ఫెయిల్ అవ్వడంతో మనస్తాపం చెందిన విద్యార్థి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం కడప జిల్లా మైదుకూరులో జరిగింది.మైదుకూరు మునిసిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన జి.హరి ఈశ్వర్ (18) సమీపంలోని చెరువులో పడి మృతి చెందాడు. మృతుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం ఫలితాలు విడుదలయ్యాయి. ఫైయిల్ అయినట్లు సమాచారం. అలాగే ఈశ్వర్ తండ్రి మునెయ్య ఆరోగ్య పరిస్థితి సరిగా లేదు. ఫలితాలు విడుదల అయిన తరువాత ఈశ్వర్ ఇంటి నుంచి వెళ్ళిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్



**కర్నూలు, పతాకం న్యూస్:** నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉందని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులు రూ.35లక్షను 65 మంది బాధితులకు పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్యానికి టీడీపీ ప్రభుత్వం భరోసా ఇస్తుందన్నారు. సీఎం చంద్రబాబురాష్ట్రంలో ఎందరో ప్రాణాలు నిలబెట్టారన్నారు. రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను స్వయంగా పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన షాపుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం షాదీఖానా భవనాన్ని పరిశీలిచి సూచనలు చేశారు. డీఈ నాగశ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. పట్టణానికి ప్రభుత్వం మంజూరు చేసిన నూతన అగ్ని మాపక వాహనాన్ని ప్రారంభించారు. ప్రజల ఆస్తుల రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని, విపత్తుల సమయంలో సత్వర స్పందనకు ఈ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి తెలిపారు.

## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు: మంత్రి దుర్గేశ్

**అమరావతి, పతాకం న్యూస్:** కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను నిర్వహించనున్నట్టు ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ వ్యాఖ్యానించారు. 2027లో వచ్చే ఈ పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారన్నారు. గోదావరి పుష్కరాలకు పది కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేశామని చెప్పుకొచ్చారు. గోదావరి పుష్కరాల్లో భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తామని వెల్లడించారు. త్వరలోనే రాజమహేంద్రవరంలో కూటమి నాయకులతో గోదావరి పుష్కరాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామని పవన్ కల్యాణ్ తెలిపారని అన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలపై పవన్ కల్యాణ్ ఆరా తీశారని కందుల దుర్గేశ్ పేర్కొన్నారు.

# వేసవిలో ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి?



వేసవికాలం ప్రారంభమైన వెంటనే ఉష్ణోగ్రతలు పెరగడం, చెమట ఎక్కువగా రావడం, డీహైడ్రేషన్, ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరగడం సహజం. ఈ సమయంలో శరీర రోగనిరోధక వ్యవస్థ మరింత కష్టపడి పనిచేయాల్సి ఉంటుంది. చాలా మంది తీసుకునే ఆహారం ఈ పరిస్థితుల్లో కీలక పాత్ర పోషిస్తుంది. కొన్ని ఆహారాలు ఇమ్యూనిటీని బలహీనపరచడం మాత్రమే కాకుండా జీర్ణ సమస్యలు, ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని కూడా పెంచుతాయని నిపుణులు చెబుతున్నారు. న్యూట్రిషన్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం అధిక కొవ్వు, వేయించిన ఆహారాలు మెటబాలిక్ ఎండోటాక్సీమియాకు దారితీస్తాయి, దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం దెబ్బతిని రోగనిరోధక శక్తి తగ్గుతుంది. వేసవిలో ఇమ్యూనిటీని మెల్లగా దెబ్బతీసే ఆహారాల్లో మొదటిగా డీప్ ఫ్రైడ్ ఫుడ్స్ ఉన్నాయి. పకోడీలు, చిప్స్ వంటి అధిక నూనె ఉన్న పదార్థాలు జీర్ణక్రియను మందగింపజేస్తాయి. వేడి కాలంలో వీటిని తీసుకుంటే అలసట, అసిడిటీ, పొట్టలో అసౌకర్యం పెరుగుతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం దెబ్బతింటే అది నేరుగా ఇమ్యూనిటీపై ప్రభావం చూపుతుంది. అలాగే చక్కెర పానీయాలు, స్వీట్లు కూడా ప్రమాదకరమే. కోల్డ్ డ్రింక్స్, ప్యాకేజ్డ్ జ్యూసులు, డెజర్ట్లు తాత్కాలికంగా చల్లదనం ఇస్తున్నట్లు అనిపించినా, అధిక చక్కెర రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది. న్యూట్రియెంట్స్ జర్నల్‌లో వచ్చిన అధ్యయనం ప్రకారం గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి సింపుల్ షుగర్లు వైట్ బ్లడ్ సెల్స్ పనితీరును తగ్గిస్తాయి. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే సామర్థ్యం తగ్గుతుంది. ప్రాసెస్ చేసిన, ప్యాకేజ్డ్ ఆహారాలు కూడా ఇమ్యూనిటీకి హానికరం. వీటిలో ప్రిజర్వేటివ్స్, అధిక ఉప్పు, అనారోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థ బ్యాలెన్స్‌ను దెబ్బతీసి శరీరం ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తిని తగ్గిస్తాయి. అందుకే వేసవిలో వీటిని తగ్గించడం మంచిది. అధిక కెఫీన్ ను తీసుకోవడం కూడా ప్రమాదకరం. కాఫీ, ఎనర్జీ డ్రింక్స్ ఎక్కువగా తీసుకుంటే డీహైడ్రేషన్ పెరుగుతుంది. జర్నల్ ఆఫ్ ఆక్యుపేషనల్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ ప్రకారం అధిక కెఫీన్ శరీరంలో మెటబాలిజం, హార్ట్ రేట్ పెంచి వేడి పరిస్థితుల్లో శరీరంపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. దీని వల్ల హీట్ ఎగ్జాషన్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అదే విధంగా అత్యధికంగా మసాలా ఆహారం తీసుకోవడం కూడా సమస్యలకు దారితీస్తుంది. మిరపకాయల్లో ఉండే క్యాప్సైసిన్ శరీరంలో వేడి భావనను పెంచి చెమట ఎక్కువగా రావడానికి కారణమవుతుంది. ఇది అసిడిటీ, కడుపులో మంట వంటి సమస్యలను కలిగించే అవకాశాలు ఉంటాయి.

వేసవిలో స్ట్రీట్ ఫుడ్ తీసుకోవడం కూడా ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. వేడి వాతావరణంలో బ్యాక్టీరియా వేగంగా పెరుగుతాయి. పరిశుభ్రత లేని ఆహారం తీసుకుంటే ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం పెరుగుతుంది. అందుకే తాజాగా శుభ్రంగా తయారైన ఆహారం తీసుకోవడం అత్యంత ముఖ్యం. అధిక ఉప్పు ఉన్న ఆహారాలకు కూడా దూరంగా ఉంచాలి. ఇవి శరీరంలో నీటి నిల్వలను ప్రభావితం చేసి డీహైడ్రేషన్‌కు దారితీస్తాయి. అలాగే రక్తపోటు, ద్రవ సమతుల్యతపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. కనుక వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఆహారంలో జాగ్రత్తలు చాలా అవసరం. అధిక నూనె, చక్కెర, ప్రాసెస్ చేసిన, పరిశుభ్రత లేని ఆహారాలను తగ్గించడం ద్వారా ఇమ్యూనిటీని రక్షించుకోవచ్చు. తాజా పండ్లు, నీటితో నిండిన, పోషకాలు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా, శక్తివంతంగా ఉంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇరాన్‌కు ఇక ఆయుధాలు పంపబోమని చైనా చెప్పింది: ట్రంప్



**న్యూయార్క్:** ఇకపై ఇరాన్‌కు ఎలాంటి ఆయుధాలు పంపబోమని చైనా అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం కీలక ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిని శాశ్వతంగా తెరిచి ఉంచేందుకు తాను చేస్తున్న ప్రయత్నాలకు చైనా మద్దతు తెలిపిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "ఇకపై హర్మూజ్ ను మూసి ఉంచడం జరగదు. హర్మూజ్ జలసంధిని నేను శాశ్వతంగా తెరుస్తుండటం చైనాకు చాలా సంతోషాన్నిచ్చింది. అమెరికాతో పాటు ప్రపంచం కోసం నేను ఈ పని చేస్తున్నాను. వారు ఇరాన్‌కు ఆయుధాలు పంపబోమని అంగీకరించారు" అని ఆయన రాసుకొచ్చారు. ప్రపంచ ఇంధన సరఫరాలో హోర్ముజ్ జలసంధి చాలా కీలకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. మరోవైపు, చైనా ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తోందంటూ గతంలో వార్తలు వచ్చిన నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో తనకున్న సంబంధాల గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. "నేను చైనా వెళితే అధ్యక్షుడు షీ జిన్ పింగ్ నన్ను గట్టిగా ఆలింగనం చేసుకుంటారు. మేమిద్దరం కలిసి తెలివిగా పనిచేస్తున్నాం. ఇది యుద్ధం కన్నా మంచిది కదా?" అని వ్యాఖ్యానించారు. అయితే, అవసరమైతే యుద్ధానికి కూడా అమెరికా సిద్ధమేనని హెచ్చరించారు. కాగా, అమెరికాతో ఇరాన్ చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం నెరుపుతున్నప్పటికీ, ఇరాన్ ను చర్చల వరకు తీసుకురావడం వెనుక చైనా హస్తం ఉందని ఇప్పటికే పలు కథనాలు వచ్చాయి. తెరవెనుక చైనా మంత్రాంగం నడుపుతోందని భావిస్తున్నారు. ఈ క్రమంలో, ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇరాన్ ఓడరేవుల నుండి నౌకల రాకపోకలు జరగకుండా పూర్తి స్థాయిలో దిగ్బంధించామని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. తామనుకున్న దిగ్బంధనాన్ని పూర్తి స్థాయిలో విజయవంతంగా అమలుపరిచామని తెలిపింది. కీలకమైన ప్రాంతీయ జల మార్గాలు ముఖ్యంగా హోర్మూజ్ వ్యాప్తంగా అమెరికా బలగాలు ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయని పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

# రబీ పంటల బీమా నమోదు సున్నా!

## ప్రభుత్వం 'ఉచితం' ఎత్తేసిన ఫలితం.. కేంద్రం ఐచ్ఛికం నిబంధన



**అమరావతి, పతాకం న్యూస్:** రబీ పంటల బీమాపై నీలి నీడలు అలముకున్నాయి. గతేడాది అక్టోబర్ నుంచి సీజన్ మొదలు కాగా పంటల సాగు మార్చి చివరాఖరుకు దాదాపు పూర్తయింది. కాగా ఏప్రిల్ రెండవ వారం ముగిసినా పంటల బీమా పథకాల్లో ఒక్క రైతు పేరు కూడా నమోదు కాలేదని తెలిసింది. కేంద్ర ప్రభుత్వానికి, బీమా కంపెనీలకు రాష్ట్రం నుంచి రబీలో బీమా చేయించుకున్న రైతుల వివరాలు నేటికీ చేరలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం 2024–25 రబీ నుంచి ఉచిత పంటల బీమా ఎత్తేసి, ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించాల్సిన ప్రీమియంలో రైతులు తమ వంతు వాటా సొమ్మును తామే చెల్లించుకోవాలని నిర్దేశించింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పంటల బీమాను రైతుల ఇష్టాఇష్టాలకు (ఐచ్ఛికం) వదిలేస్తూ నిబంధనలు మార్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకంతో ముందటేడాది రబీ, నిరుడు ఖరీఫ్‌లో బీమా పరిధిలోకొచ్చిన రైతుల సంఖ్య భారీగా పడిపోయింది. ఈ రబీలో మొత్తానికే రైతులు బీమా చేయించుకునేందుకు ముందుకు రాలేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రబీ పంటల బీమాకు ఇంకా సమయం ఉందని మరి కొందరు ఆశావహంగా చెబుతున్నారు. రబీలో అకాల వర్షాలు వ్యవసాయ పంటలను, పండ్ల తోటలను నష్టపరిచాయి. ఇంకో వైపు చాలా ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం రబీలో నామమాత్రంగా కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకుతంది. ఈ తరుణంలో రైతులకు కాస్తంత ఆసరా కావాల్సిన పంటల బీమా ప్రశ్నార్ధకమైంది. వైసిపి హయాంలో తొలుత ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కంపెనీలతో సంబంధం లేకుండా పంటల బీమా పథకాలను నిర్వహించింది. కేంద్రం ఒత్తిడితో 2022 రబీ నుంచి ఫసల్, వాతావరణ ఆధారిత బీమా పథకాల్లో చేరింది. ఇ–క్రాప్‌లో సాగు నమోదైన రైతులందకీ పథకాలు వర్తింపజేసింది. రైతుల వాటా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తానంది. వైసిపి సర్కారు సరిగ్గా ప్రీమియం చెల్లించనందున నేటికీ క్లెయిములు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా, సమగ్ర పంటల బీమా తెస్తామన్న కూటమి ప్రభుత్వం, అప్పటి వరకు ఉన్న ఉచిత పంటల బీమాను ఎత్తేసి, ప్రీమియం భారాన్ని రైతుల నెత్తిన వేసింది. కేంద్రం ఆదేశాలతో బీమాను రైతులకు అప్షనల్‌గా మార్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలేడాది 2024 ఖరీఫ్‌లో ఉచిత పంటల బీమా, ఇ–క్రాప్‌ను అమలు చేయగా, ఆ సీజన్‌లో ఫసల్ బీమా కింద 24 లక్షల మంది, వాతావరణ బీమా కింద 8 లక్షల మంది రైతులు వచ్చారు. ఉచిత పంటల బీమా ఎత్తేశాక 2025 ఖరీఫ్‌లో 4.52 లక్షలు, 3 లక్షలకు రైతులు తగ్గారు. ఉచిత పంటల బీమా ఉన్నప్పుడు 2023 రబీలో ఫసల్ కింద 12.92 లక్షలు, వాతావరణ బీమా కింద 1.92 లక్షల మంది వచ్చారు. ఉచిత పంటల బీమా ఎత్తేసిన 2024 రబీలో ఫసల్ కిందకు 2.91 లక్షలు, వాతావరణ బీమా కిందకు కేవలం 15 వేల మంది వచ్చారు. ఉచిత పంటల బీమా ఎత్తేశాక రెండో రబీ ఈ సవవత్సరం (2025–26)లో రెండు పథకాల్లోనూ ఒక్క రైతు కూడా తమ పేరు నమోదు చేయించుకోలేదు.

ప్రస్తుత రబీలో పంటల సాగు ఆశాజనకంగా ఉందని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానవన పంటలన్నీ కలుపుకొని 75 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. సాధారణ సాగు విస్తీర్ణం కంటే సేద్యం కొంచెం ఎక్కువేనంటున్నారు. ఇంత సాగు జరిగినా ఒక్క రైతు కూడా బీమా కిందికి రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను సకాలంలో విడుదల చేసి, బీమా చేయించుకున్న రైతుల పూర్తి సమాచారం అందించిన సందర్భాల్లోనే బీమా కంపెనీలు విపత్తులతో పంటలు నష్టపోయిన రైతుల క్లెయిముల పరిష్కారానికి, పరిహారం సొమ్ము చెల్లించడానికి కొర్రీలు వేస్తాయి. అలాంటిది రైతుల నమోదులు లేకపోతే.. అన్నదాతలకు దక్కే పిసరంత బీమా సహాయం సైతం కోల్పోవలసి వస్తుంది. రైతులకు బీమా భరోసా ఉండదు.




# లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై

# రాయల్ చాలెంజర్స్ బెంగళూరు గెలుపు




విరాట్ కోహ్లీ (34 బంతుల్లో 6 ఫోర్లు, ఓ సిక్స్‌తో 49)తోపాటు బౌలర్లు చెలరేగంతో.. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) టాప్ లేపింది. మ్యాచ్‌లో బెంగళూరు 5 వికెట్లతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్జీ)ను చిత్తు చేసింది. తొలుత లఖ్‌నవూ 20 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (40), ముకుల్ చౌధరి (39), ఆయుష్ బదోని (38) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. రసిక్ సలామ్ 4, భువనేశ్వర్ 3 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో బెంగళూరు 15.1 ఓవర్లలో 149/5 స్కోరు చేసి గెలిచింది. కెప్టెన్ రజత్ పటీదార్ (27), జితేష్ శర్మ (23) రాణించారు. ప్రిన్స్ 3, అవేశ్ 2 వికెట్లు తీశారు. హాజెల్‌వుడ్ (4–0–20–1) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఛేదనలో ఇంపాక్ట్ ప్లేయర్ కోహ్లీ విజృంభించడంతో.. బెంగళూరు సులువుగా నెగ్గింది. మరో ఓపెనర్ సాల్ట్ (7) విఫలమైనా.. కోహ్లీ క్లాస్ ఆటతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో ఎండ్‌లో దేవ్‌దత్ పడిక్కల్ (10) స్ట్రయిక్ రొటేట్ చేస్తూ సహకారం అందించాడు. మూడో ఓవర్‌లో షమి బౌలింగ్‌లో హ్యాట్రిక్ బౌండ్రీలు బాదిన విరాట్.. ఆ తర్వాతి ఓవర్‌లో ప్రిన్స్ బౌలింగ్‌లో మరో 4 ఫోర్లు కొట్టాడు. అనంతరం దిగ్వేష్ బౌలింగ్‌లో విరాట్ సిక్స్ బాదడంతో.. పవర్‌ప్లేను బెంగళూరు 60/1తో ముగించింది. అయితే, 8వ ఓవర్‌లో పడిక్కల్‌ను అవేశ్ క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఫిఫ్టీకి పరుగు దూరంలో ఉన్న కోహ్లీని కూడా అవేశ్ వెనక్కిపంపాడు. ఈ దశలో పటీదార్, జితేష్ మూడో వికెట్‌కు 13 బంతుల్లో 35 రన్స్ జోడించడంతో.. బెంగళూరు లక్ష్యం దిశగా సాగింది. అయితే, 13వ ఓవర్‌లో పటీదార్, జితేష్‌లను ప్రిన్స్ అవుట్ చేసి షాకిచ్చాడు. కానీ, డేవిడ్ (14 నాటౌట్), షెపర్డ్ (14 నాటౌట్) 29 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు.

మందకొడి పిచ్‌పై బెంగళూరు బౌలర్లు సమష్టిగా చెలరేగడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. పవర్‌ప్లేలో హాజెల్‌వుడ్ కట్టుదిట్టంగా బంతులేయడంతో.. ఓపెనర్లు మార్ష్, మార్‌క్రమ్ (12) కష్టంగా తొలి వికెట్‌కు 32 పరుగులు జోడించారు. సిక్స్‌తో దూకుడుగా ఆడే ప్రయత్నం చేసిన మార్‌క్రమ్‌ను రసిక్ అవుట్ చేశాడు. కెప్టెన్ పంత్ (1) రిటైర్డ్ హర్ట్ కాగా, పూరన్ (1)ను హాజెల్‌వుడ్ బౌల్డ్ చేశాడు. ఆ దశలో మార్ష్, బదోని నాలుగో వికెట్‌కు 38 రన్స్ జతచేశారు. కానీ, మార్ష్, సమద్ (0)ను క్రునాల్ అవుట్ చేసి దెబ్బకొట్టాడు. 83/4తో ఇబ్బందుల్లో పడిన తరుణంలో బదోనితో కలసి ముకుల్ ఐదో వికెట్‌కు 38 రన్స్ జోడించాడు. కానీ, బదోనీని రసిక్ వెనక్కి పంపడంతో లఖ్‌నవూ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. మళ్లీ క్రీజులోకి వచ్చిన పంత్‌తోపాటు లిండే (7), షమి (0)ను భువీ పెవిలియన్ చేర్చగా..ఆఖరి ఓవర్‌లో ముకుల్, అవేశ్ ఖాన్ (1) వికెట్లను రసిక్ తీశాడు.

# ఆందోళనకరంగా టీమిండియా మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఆరోగ్యం.. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం!




భారత క్రికెట్‌లో అగ్రశేణి బ్యాటర్‌గా వెలుగొందిన వినోద్ కాంబ్లీ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మెదడులో క్లాట్ ఏర్పడటంతో భవిష్యత్తులో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదముందని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని కాంబ్లీ స్నేహితుడు మార్కస్ కౌటో ధ్రువీకరించారు. ప్రస్తుతం కాంబ్లీ కోలుకుంటున్నప్పటికీ పూర్తిగా ఆరోగ్యవంతుడిగా లేడని వెల్లడించారు. 90వ దశకంలో భారత జట్టులోకి అడుగుపెట్టిన వినోద్ కాంబ్లీపై భారీ అంచనాలు ఉండేవి. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు అతడు బాల్యమిత్రుడు. గతేడాది కిడ్నీ సంబంధిత ఇన్ఫెక్షన్, కండరాల నొప్పులతో థానేలోని ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటున్నాడు. అప్పట్లో అతడి ఆరోగ్యంపై పెద్ద చర్చ జరిగింది. సునీల్ గావస్కర్, కపిల్ దేవ్ వంటి దిగ్గజ ప్లేయర్లు కాంబ్లీకి ఆర్థిక సాయం కూడా చేశారు. తాజాగా కాంబ్లీ స్నేహితుడు చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. 'కాంబ్లీకి మెదడులో క్లాట్ ఏర్పడింది. అది తొలగించడం సాధ్యం కాలేదు. వైద్యుల చెప్పినదాని ప్రకారం అతడికి భవిష్యత్తులో బ్రెయిన్ స్ట్రోక్ కూడా రావచ్చు. ఆయన జ్ఞాపకశక్తి కూడా సరిగ్గా లేదు. చాలా విషయాలు ఆయన మర్చిపోయాడు. కాంబ్లీ ప్రస్తుతం మద్యం పూర్తిగా మానేశాడు. కానీ అప్పుడప్పుడు సిగరెట్ కోసం ఇతరులను అడుగుతూ ఉంటాడు. ఆయన సమస్య అంతా మెదడులోనే ఉంది' అని కాంబ్లీ స్నేహితుడు వివరించాడు. వినోద్ కాంబ్లీ భారత్ తరఫున 104 వన్డేలు, 17 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. చెడు వ్యసనాల కారణంగా పీక్ స్టేజీలో ఉన్న అతడి కెరీర్.. అనూహ్యంగా దిగజారిపోయింది. మద్యం, ధూమపానం మితిమీరి తీసుకోవడం వల్లే ఆయన అనారోగ్యం పాలయ్యారని పలు నివేదికలు వెల్లడించిన సంగతి తెలిసిందే.




## ‘శ్రీనివాస మంగాపురం’ టీజర్



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న చిత్రం ‘శ్రీనివాస మంగాపురం’ ‘ఆర్ఎక్స్ 00, మంగళవారం’ చిత్రాలతో ప్రేక్షకుల, విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఓ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాపై భారీగా అంచనాలున్న విషయం తెలిసిందే.

ఈ చిత్ర టీజర్‌ని సూపర్ స్టార్ మహేష్ బాబు ‘ఎక్స్’ వేదికగా విడుదల చేశారు. “‘శ్రీనివాస మంగాపురం’ టీజర్‌ను లాంచ్ చేయడం చాలా సంతోషంగా ఉంది… టీజర్ చాలా ప్రామిసింగ్‌గా కనిపిస్తోంది. జయకృష్ణ ఈ అందమైన సినిమా ప్రపంచంలోకి అడుగుపెడుతున్నందుకు గర్వంగా ఉంది. అతనికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రతి అడుగులోనూ అతను ఇంకా ఎదగాలని కోరుకుంటున్నాను” అని మహేష్ బాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. టీజర్ ఎలా ఉందంటే .. ‘శ్రీనివాస మంగాపురం’ టీజర్ చూస్తుంటే, ఒక ప్యూర్ అండ్ ఇంటెన్స్ లవ్ స్టోరీలా అనిపిస్తోంది. తిరుపతి నేపథ్యంలో సాగే ఈ కథలో ఎమోషన్స్‌ని దర్శకుడు బాగా రాబట్టినట్లుగా తెలుస్తోంది. టీజర్‌లో జయకృష్ణ లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ బాగున్నాయి. ముఖ్యంగా రషా తడాని హీరోయిన్‌గా చాలా క్యూట్‌గా, ఇంప్రెసివ్‌గా కనిపిస్తోంది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని తెలుస్తోంది. ‘మంగ నీది కాదు వాసు బాబు’, ‘మంగ లేకుండా ఈ వాసు బాబు తిరుపతి విడిచి వెళ్ళడు’ వంటి డైలాగ్స్ కథలోని డెప్త్‌ను, హీరో క్యారెక్టర్‌లోని మొండితనాన్ని తెలియజేస్తున్నాయి. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉన్నాయి. అజయ్ భూపతి మార్క్ మేకింగ్ కనిపిస్తోంది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌లోని ఎమోషన్‌ను బాగా ఎలివేట్ చేసింది. తిరుపతి పరిసర ప్రాంతాల్లో షూట్ చేయడం వల్ల ఒక నేటివిటీ ఫీల్ వస్తోంది. మోహన్ బాబు వంటి సీనియర్ నటులు ఉండటం సినిమాకు అదనపు బలం. ఆయన క్యారెక్టర్ కూడా ఇందులో సింపుల్‌గా టచ్ చేశారు. ఇందులో భారీ తారాగణం ఉన్నట్లుగా ఈ టీజర్ క్లారిటీ ఇస్తోంది. చాలా వరకు పాత్రలను పరిచయం చేశారు. ఈ టీజర్ ఒక ఫ్రెష్ అండ్ ఇంటెన్స్ వైబ్‌ని కలిగి ఉంది. అజయ్ భూపతి గత చిత్రమైన ‘ఆర్ఎక్స్ 100’ తరహా బలమైన ప్రేమకథ, అంతకుమించిన ఎమోషన్స్ ఉంటాయనేలా తెలియజేయడంలో ఈ టీజర్ సక్సెస్ అయిందనే చెప్పుకోవచ్చు. ప్రస్తుతం ఈ టీజర్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. అగ్ర నిర్మాత అశ్విని దత్ సమర్పిస్తోన్న ఈ చిత్రాన్ని పి కిరణ్ నిర్మిస్తున్నారు.

## సంయుక్త మీనన్ ఎమోషనల్ పోస్ట్



టాలీవుడ్ ‘గోల్డెన్ లెగ్’ సంయుక్త మీనన్ తన తాజా చిత్రం ‘బ్లాక్ గోల్డ్’ షూటింగ్‌లో ఎదురైన సవాళ్లను వివరిస్తూ సోషల్ మీడియా వేదికగా స్పందించింది. సినిమా తెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా, దాని వెనుక చిత్ర యూనిట్ పడే శ్రమ ఎంతటిదో ఆమె పెట్టిన పోస్ట్ నిరూపిస్తోంది. సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో సాగే ఈ సినిమా కోసం చిత్ర యూనిట్ మంచిర్యాలలో షూటింగ్ నిర్వహించింది. అక్కడ 40 నుంచి 45 డిగ్రీల తీవ్రమైన ఉష్ణోగ్రతల మధ్య పనిచేయడం తమను శారీరకంగా, మానసికంగా పరీక్షించిందని సంయుక్త పేర్కొంది. మండుతున్న ఎండలు, తీవ్రమైన అలసట వేధించినప్పటికీ చిత్ర బృందం ఎక్కడా వెనకడుగు వేయకుండా పనిచేసిందని ఆమె కితాబునిచ్చింది. డీహైడ్రేషన్ బారిన పడకుండా తన పర్సనల్ టీమ్ (నిహారిక, పార్థు) తీసుకున్న జాగ్రత్తలు, దర్శకుడు యోగి అందించిన ప్రోత్సాహం వల్లే ఈ కఠినమైన షెడ్యూల్‌ను పూర్తి చేయగలిగానని తెలిపింది.

మంచిర్యాల షెడ్యూల్ ముగిసిన వెంటనే సంయుక్త నేరుగా తిరుమలకు చేరుకుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్న ఆమె, ఆ ప్రశాంతతలో దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఎంతటి ఒత్తిడిలో షూటింగ్ ప్రారంభించానో, అంతే ఉత్సాహంతో తిరిగి వస్తున్నానని ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

## ‘రామాయణ’పై స్పందించిన యశ్



కన్నడ సూపర్‌స్టార్, పాన్ ఇండియా హీరో యశ్ తన రాబోయే చిత్రం ‘రామాయణ’ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ‘సినిమాకాన్ 2026’ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన, రామాయణ గాథకు ఉన్న ప్రత్యేకతను వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో యశ్ రావణుడి పాత్రలో నటిస్తుండటం విశేషం. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ, ““రామాయణం’లో చాలా కాలం పాటు గుర్తుండిపోయే ఒక బలమైన అంశం ఉంది. ఈ కథ ఎన్నో ఏళ్ళుగా నిలవడమే కాకుండా, సరిహద్దులు, సంస్కృతులకు అతీతంగా ప్రజల మనసుల్లో నిలిచిపోయిందంటే దానిలో విశ్వవ్యాప్త ఆకర్షణ ఉందని అ ర్థం” అని అన్నారు. “ప్ర స్తుత ఆధునిక టెక్నాలజీతో ఈ కథను వెండితెరపై చూపిస్తే, ప్రేక్షకులకు ఒక కొత్త, లీనమయ్యే అనుభూతి కలుగుతుంది” అని ఆయన అభిప్రాయపడ్డారు. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ఆస్కార్ విన్నింగ్ సంస్థ డీఎన్ఈజీ, యశ్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా నటిస్తుండగా, సాయి పల్లవి, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్వరమాంత్రికుడు ఏ.ఆర్. రెహమాన్, హాలీవుడ్ సంగీత దర్శక దిగ్గజం హాన్స్ జిమ్మెర్ సంగీతం అందిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రంలోని రణ్‌బీర్ కపూర్ ఫస్ట్ లుక్‌కు సంబంధించిన వీఎఫ్ఎక్స్‌పై సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**